RNI No. APTEL/2009/28868

# సిటిజన్ టైమ్స్


తెలుగు దినపత్రిక

ప్రజా సమస్యలపై పోరాటమే మా లక్ష్యం

CITIZEN TIMES TELUGU DAILY

VOLUME: 17 | ISSUE: 247 | EDITOR: KANCHERLA SANDEEP KUMAR | VISAKHAPATNAM 2-4-2026 | Pages: 8 | Rs: 2/-

సంపుటి : 17 | సంచిక :247 | ఎడిటర్: కంచర్ల సందీప్ కుమార్ | విశాఖపట్నం 2-4-2026 | పేజీలు : 8 | రూ: 2/-





## అమరావతికి చట్టబద్ధత బిల్లు.. లోక్‌సభ ఆమోదం

**రేపు రాజ్యసభ ముందుకు బిల్లు**

### ఒకే ఒక రాజధాని... అమరావతికి ఇక తిరుగులేదు: సీఎం చంద్రబాబు

### అమరావతి భవిష్యత్తుపై అనిశ్చితికి నేటితో తెరపడింది: సుజనా చౌదరి

### ఏపీకి శాశ్వత రాజధానిగా అమరావతి: ఎంపీ పురందేశ్వరి

**అమరావతి, సిటిజన్ టైమ్స్**

ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే కీలక బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ బుధవారం 'ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం సవరణ బిల్లు-2026'ను సభలో ప్రవేశపెట్టారు. చర్చ అనంతరం, ఈ బిల్లు ఆమోదం పొందినట్లు ప్యానెల్ స్పీకర్ తెన్నేటి కృష్ణప్రసాద్ ప్రకటించారు. ఈ బిల్లుపై సభలో సుమారు రెండు గంటల పాటు సుదీర్ఘ చర్చ జరిగింది. తెలుగుదేశం, బీజేపీ, జనసేన, కాంగ్రెస్ పార్టీలు బిల్లుకు మద్దతు పలకగా, వైసీపీ ఎంపీలు చర్చ మధ్యలో సభ నుంచి వాకౌట్ చేశారు. 2024 జూన్ 2 నుంచి ఈ సవరణ వర్తించేలా బిల్లులో పొందుపరిచారు. ఈ చట్ట సవరణతో రాష్ట్రానికి అమరావతి ఏకైక రాజధానిగా చట్టపరమైన భద్రత లభిస్తుంది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ, "అమరావతి రైతుల కన్నీళ్ల మీద ఈ చట్టం నిర్మాణమైంది. ఇది ఆంధ్ర ప్రజల కలల రాజధాని" అని అన్నారు. బీజేపీ ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ, "అమరావతి ఆంధ్రప్రదేశ్‌కు శాశ్వత రాజధానిగానే ఉంటుంది" అని స్పష్టం చేశారు. లోక్‌సభ ఆమోదం పొందిన ఈ బిల్లు రేపు గురువారం (ఏప్రిల్ 2) రాజ్యసభ ముందుకు వెళ్లనుంది. పెద్దల సభలో కూడా ఆమోదం పొందితే, రాష్ట్రపతి ఆమోదంతో చట్టంగా మారనుంది. దీంతో గతంలో వచ్చిన మూడు రాజధానుల ప్రతిపాదనకు చట్టపరంగా తెరపడినట్లవుతుంది.

**ఒకే ఒక రాజధాని... అమరావతికి ఇక తిరుగులేదు: సీఎం చంద్రబాబు**

ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ లోక్‌సభలో బిల్లు ఆమోదం పొందడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఇది ఆంధ్రుల ఆత్మగౌరవానికి, ప్రజల ఆకాంక్షలకు లభించిన గౌరవమని ఆయన అభివర్ణించారు. ఈ చారిత్రాత్మక పరిణామంతో రాజధాని భవిష్యత్తుపై నెలకొన్న సందిగ్ధతకు శాశ్వతంగా తెరపడిందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు స్పందిస్తూ, "గత ప్రభుత్వ పాలనలో ఎదురైన చీకట్లు తొలగిపోయాయి. ప్రజా రాజధాని అమరావతి ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీక. రైతుల త్యాగానికి దక్కిన గౌరవం ఇది. స్వర్ణాంధ్ర నిర్మాణంలో ఇది ఒక కీలక మైలురాయి. అమరావతి

తరువాయి 2లో..

## హిట్ అండ్ రన్ నేరాల కంటే ఘోరంగా

## ఓ పార్టీ రాజకీయాలు చేస్తోంది



### సంక్షేమ పథకాల వెల్లువ

### అభివృద్ధి, పెట్టుబడులే లక్ష్యం

### సుపరిపాలన - చేనేతలకు వరం

**అమరావతి, సిటిజన్ టైమ్స్**

వైసీపీ తీరుపై ముఖ్యమంత్రి చంద్రబాబు పరోక్షంగా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. హిట్ అండ్ రన్ నేరాల కంటే ఘోరంగా ఓ పార్టీ రాజకీయాలు చేస్తోందని, కళ్లార్పకుండా అసత్యాలు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. నెల్లూరు జిల్లా వింజమూరులో జరిగిన 'పేదల సేవలో' కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ప్రజావేదిక సభలో ఆయన ప్రసంగించారు. ప్రతిపక్షం చేస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని ఆయన కోరారు.

**హిట్ అండ్ రన్ కంటే దారుణం**

జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ విషయంలో వైసీపీ అసత్యాలు ప్రచారం చేస్తోందని చంద్రబాబు ఆరోపించారు. 2018-19లోనే తమ ప్రభుత్వం రూ.285 కోట్లతో హార్బర్

తరువాయి 2లో..



## తేయాకు తోటలో మోదీ

### తేయాకు ఆకులు కోసి, కార్మికులతో సెల్ఫీ దిగిన ప్రధాని నరేంద్రమోదీ

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అసోంలోని దిబ్రుగఢ్ జిల్లాలోని ఒక తేయాకు తోటను సందర్శించారు. అక్కడి మహిళా కార్మికులతో కలిసి తేయాకు ఆకులను కోశారు. వారితో సెల్ఫీలు దిగారు. ఈ ఫొటోలను మోదీ తన అధికారిక 'ఎక్స్' ఖాతాలో పంచుకున్నారు. పలువురు కార్మికులు మోదీతో సెల్ఫీ దిగేందుకు ఆసక్తి చూపించారు. మోదీ రాక నేపథ్యంలో గిరిజన కార్మికులు సంప్రదాయ నృత్యంతో ఆయనకు స్వాగతం

తరువాయి 2లో..

## లోక్ సభలో అమరావతి బిల్లు పాస్..

## టీవీ లైవ్ చూసి చప్పట్లు కొట్టిన లోకేశ్...




**అమరావతి, సిటిజన్ టైమ్స్**

ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే చారిత్రక ఘట్టం పార్లమెంటులో ఆవిష్కృతమవుతున్న వేళ, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ ఆ క్షణాలను టీవీలో ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. లోక్‌సభలో అమరావతి బిల్లు ఆమోదం పొందిన వెంటనే ఆయన చప్పట్లు కొట్టి తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. అంతేకాకుండా, సభలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, బీజేపీ ఎంపీ పురందేశ్వరి అమరావతికి మద్దతుగా మాట్లాడుతున్న దృశ్యాలను తన ఫోన్‌లో వీడియో తీశారు. 'ఒకే రాష్ట్రం-ఒకే రాజధాని' నినాదంతో, అభివృద్ధి వికేంద్రీకరణ విధానంతో ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ గతంలో చేసిన ఏకగ్రీవ తీర్మానానికి అనుగుణంగా, అమరావతిని ఏకైక రాజధానిగా గుర్తిస్తూ కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును నేడు లోక్ సభలో ప్రవేశపెట్టి ఆమోదింపజేసింది. ఈ చారిత్రక సందర్భంపై లోకేశ్ స్పందిస్తూ, ఇది ఐదు కోట్ల ఆంధ్రులు గర్వంగా నినదించే రోజని అభివర్ణించారు. "నా రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ - నా రాజధాని అమరావతి" అని ప్రతి ఒక్కరూ చెప్పుకునే రోజు ఇదని అన్నారు. ఇది ఐదు కోట్ల ఆంధ్రుల ఆకాంక్షల విజయమని, రైతుల త్యాగాలకు దక్కిన దైవ

తరువాయి 2లో..

## రెండ్రోజుల తర్వాత మళ్లీ కళకళలాడిన భారత స్టాక్ మార్కెట్లు




**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం నాడు భారీ లాభాలతో ముగిశాయి. గత రెండు రోజులుగా కొనసాగుతున్న నష్టాలకు బ్రేక్ పడింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 1,186.77 పాయింట్లు లాభపడి 73,134.34 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 348 పాయింట్లు పెరిగి 22,679.40 వద్ద క్లోజ్ అయింది. అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తగ్గుముఖం పడతాయన్న ఆశలతో మార్కెట్లు ఉదయం భారీ లాభాలతో ప్రారంభమయ్యాయి. అయితే,

తరువాయి 2లో..

## ఎల్‌డీఎఫ్ గెలుపునకు మోదీ ప్రయత్నం



### వారిద్దరి మధ్య భాగస్వామ్యం

### రాహుల్ గాంధీ ఆరోపణ

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

కన్నూర్, కోళికోడ్: కేరళలో లెఫ్ట్, భాజపా కలిసి పని చేస్తున్నాయని, ఎల్‌డీఎఫ్ గెలవాలని ప్రధాని మోదీ కోరుకుంటున్నారని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఎల్‌డీఎఫ్, భాజపా ఉమ్మడి శత్రువును

తరువాయి 2లో..

## అమరావతి బిల్లుకు లోక్‌సభ ఆమోదం..

## ఇది చారిత్రాత్మక ఘట్టమన్న పవన్ కల్యాణ్

**అమరావతి, సిటిజన్ టైమ్స్**



ఆంధ్రప్రదేశ్ ఏకైక, శాశ్వత రాజధానిగా అమరావతిని నిర్ధారిస్తూ లోక్‌సభలో ప్రవేశపెట్టిన బిల్లు ఆమోదం పొందడంపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. ఇది రాష్ట్ర చరిత్రలోనే ఒక చారిత్రాత్మక, కీలకమైన ఘట్టమని అభివర్ణించారు. ఈ చరిత్రాత్మక సందర్భంలో ఆంధ్రప్రదేశ్‌లోని ఐదు కోట్ల మంది ప్రజలకు ఆయన హృదయపూర్వక అభినందనలు తెలిపారు. రాష్ట్ర ప్రజల సంకల్పానికి, ఆకాంక్షలకు ఈ బిల్లు ప్రతిబింబమని ఆయన తన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా అమరావతి రైతుల మహోన్నత

తరువాయి 2లో..



## తుక్కు నౌకలు.. మడ్డి చమురు

### ఇవే ఇరాన్ పదునుపెట్టిన రహస్య ఆయుధాలు

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

ఇంటర్నెట్‌డెస్క్: వేల కొద్దీ అంతర్జాతీయ ఆంక్షలు.. అమెరికాకు భయపడి అంటీముట్టనట్లుండే మిత్రులు.. డాలర్‌తో పోలిస్తే పాతాళానికి పడిపోయిన కరెన్సీ.. మరోవైపు ఆధునిక కాలంలో యుద్ధం అంటే కరెన్సీ కట్టలను కుప్పలు పోసి తగలపెట్టడం లాంటిదే.. సొంతంగా ఆయుధాలు తయారు చేసుకోవాలన్నా భారీగా సొమ్ములు అవసరం. దాదాపు నెల రోజులుగా ఇరాన్ తనపై ఇజ్రాయెల్, అమెరికా చేస్తున్న దాడులకు బలంగా సమాధానం ఇస్తోంది. ఆ దేశం వద్ద ఆదాయానికి ఉన్న మార్గాలు మొత్తం మూసుకుపోయినా ఎలా సాధ్యమైంది. ఇరాన్ ఆంక్షలకు రాటుదేలిపోయింది.. తన వద్ద ఉన్న వనరులను వాడుకొని వాటికి ప్రత్యామ్నాయ మార్గాలను కనుగొని చురుగ్గా ఉపయోగించు కుంటోంది. దీంతో అమెరికా, ఇజ్రాయెల్‌ను ఎదురు దాడులతో ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.

**కారు చౌకగా క్రిప్టో మైనింగ్.. ఆపై కనకవర్షం..!**

ఇరాన్ నుంచి కొన్నేళ్లుగా అంతర్జాతీయ చమురు ఎగుమతులు నిలిచిపోయాయి. కానీ, ఆ దేశం వద్ద చమురు నిల్వలు పుష్కలంగా ఉన్నాయి. మరోవైపు క్రిప్టో మైనింగ్‌కు భారీగా

తరువాయి 2లో..

## ఎడిటోరియల్

### రాజధానిగా అమరావతి చట్టసవరణ వేళ బాబు భారీ ప్లాన్

ఏపీ రాజధానిగా అమరావతిని ఖరారు చేయటమే కాదు.. దానికి శాశ్వితత్వాన్ని కట్టబెడుతూ పార్లమెంటులో బిల్లు ప్రవేశ పెట్టేందుకు సర్వం సిద్ధమైంది. దీనికి సంబంధించి ఏపీలోని కూటమి సర్కారు ఇప్పటికే అమరావతిని రాజధానిగా ఖరారు చేస్తూ తీర్మానాన్ని పంపిన సంగతి తెలిసిందే. విభజన చట్టంలో సవరణ చేస్తూ ప్రతిపాదిస్తున్న బిల్లు బుధవారం పార్లమెంటులో ప్రవేశ పెట్టనున్నారు. దీని ఆమోదానికి కేంద్రం ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏపీ రాజధానిగా అమరావతిని డిసైడ్ చేస్తూ.. దాన్ని మళ్లీ మార్చేందుకు వీల్లేని విధంగా కేంద్రం చట్టాన్ని రూపొందించేందుకు కీలక చర్యలు చేపడుతున్నారు. పార్లమెంటులో రాజధాని అమరావతి బిల్లును ప్రవేశ పెడుతున్న వేళలో ఏపీ వ్యాప్తంగా దానికి అనుకూలమైన వాతావరణం ఉందన్న విషయాన్ని తెలియజేసే అధికారపక్షం పక్కా ప్లాన్ చేసింది. జగన్ సర్కారు హయాంలో ఏపీ రాజధానిగా ఉన్న అమరావతి స్థానంలో మూడు రాజధానుల కాన్సెప్టును తీసుకురావటం.. ఆ విషయంలో నెలకొన్న గందరగోళానికి తెర దించుతూ.. తమ వాదనను బలంగా వినిపించటమే కాదు..చట్టబద్ధతను తీసుకొచ్చేలా చేస్తున్న ప్రయత్నాలకు ప్రజల ఆమోదం ఉందన్న విషయాన్ని చాటి చెప్పాలని సీఎం చంద్రబాబు భావిస్తున్నారు. ఇందులో భాగంగా ఏపీ వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోనూ రాజధాని అమరావతి బిల్లుకు అనుకూలంగా ప్రజలు పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహించేలా ప్లాన్ చేవారు. పార్లమెంటులో అమరావతి ఏపీ శాశ్విత రాజధాని బిల్లు ఆమోదానికి ముందే.. ఏపీ వ్యాప్తంగా అన్ని ప్రాంతాల మద్దతు ఉందన్న విషయాన్ని చాటి చెప్పాలన్న ఆలోచనలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నారు. ఈ వాదనకు బలం చేకూరేలా టీడీపీ నేతలకు ప్రత్యేక టెలికాన్ఫరెన్స్ ను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం చంద్రబాబు కీలక సూచనలు చేశారు. బుధవారం రాష్ట్రస్థాయిలోనూ..జిల్లాలు.. మండలాల స్థాయిలోనూ రాజధాని అమరావతికి మద్దతుగా కూటమి పార్టీలు ప్రత్యేక కార్యక్రమాల్ని నిర్వహించేలా ప్లాన్ చేశాయి. మొత్తంగా ఏపీ వ్యాప్తంగా తాము తీసుకున్న నిర్ణయానికి పెద్ద ఎత్తున ప్రజామోదం ఉందన్న విషయాన్నిచాటి చెప్పాలన్నది సీఎం చంద్రబాబు ఆలోచనగా చెబుతున్నారు. రాజధాని అమరావతి అంశాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్న చంద్రబాబు.. ఈసారి ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవటం గమనార్హం.

## ఎల్‌డీఎఫ్ గెలుపునకు మోదీ ప్రయత్నం

తమ కూటమి యూడీఎఫ్ ఎదుర్కొంటోందని పేర్కొన్నారు. కోళికోడ్ జిల్లాలోని కన్నూర్, కల్లాచి, పెరంబ్ర, కోయిలాండిలలో మంగళవారం జరిగిన ఎన్నికల ప్రచార సభల్లో ఆయన మాట్లాడారు. ఆయన వెంట సీపీఎం మాజీ నేతలు వి.కున్హికృష్ణన్, టీకే గోవిందన్ ఉన్నారు. వారిద్దరు స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారు. వారికి యూడీఎఫ్ మద్దతిస్తోంది. 'ఈ ఎన్నికలు రెండు సిద్ధాంతాల మధ్య జరుగుతున్నాయి. తొలిసారిగా భాజపా, ఎల్డీఎఫ్ పొత్తు పెట్టుకోవడాన్ని చూస్తున్నాం. లెఫ్ట్ పార్టీలు మితవాదులతో పొత్తు పెట్టుకోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. వారి సిద్ధాంతాలు పూర్తిగా వైరుధ్యంతో కూడుకున్నవి. ఈ పొత్తు నచ్చకే సీనియర్ నేతలు బయటకు వచ్చి స్వతంత్రంగా పోటీ చేస్తున్నారు' అని వ్యాఖ్యానించారు. ఇతర చోట్ల మతం, దేవుడి గురించి మాట్లాడే మోదీ.. కేరళలో ఆ విషయాలను ప్రస్తావించరని విమర్శించారు. శబరిమల ఆలయంలో జరిగిన బంగారు తాపడాల స్కాం గురించి ఇప్పటివరకూ ఆయన ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు.

## అమరావతికి చట్టబద్ధత బిల్లు..

# లోక్‌సభ ఆమోదం

ఇక అజేయం.. అజరామరం" అని అన్నారు. రాజధానిని ప్రపంచపటంలో నిలిపేలా విశ్వనగరంగా తీర్చిదిద్దుతామని ఆయన పునరుద్ఘాటించారు. ఈ బిల్లు ఆమోదానికి సహకరించిన కేంద్ర ప్రభుత్వానికి, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు ముఖ్యమంత్రి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. లోక్‌సభలో బిల్లుకు మద్దతు పలికిన అన్ని రాజకీయ పార్టీలకు ఆంధ్రప్రదేశ్ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ నిర్ణయం రాష్ట్ర అభివృద్ధిలో ఒక నూతన అధ్యాయానికి నాంది పలుకుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

అమరావతి భవిష్యత్తుపై అనిశ్చితికి నేటితో తెరపడింది: సుజనా చౌదరి

ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా అమరావతిని ఖరారు చేస్తూ కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. ఈ మేరకు 'ఆంధ్రప్రదేశ్ పునర్విభజన (సవరణ) బిల్లు - 2026'ను నేడు లోక్ సభలో ప్రవేశపెట్టగా, సభ ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంతో అమరావతి భవిష్యత్తుపై సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న అనిశ్చితికి తెరపడినట్లయింది. కేంద్ర ప్రభుత్వ తాజా నిర్ణయంపై బీజేపీ ఎమ్మెల్యే సుజనా చౌదరి హర్షం వ్యక్తం చేశారు. ఇది చారిత్రక విజయమని, రాజధాని కోసం భూములు త్యాగం చేసిన రైతులకు దక్కిన గొప్ప గౌరవమని ఆయన అభివర్ణించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "అమరావతికి చట్టబద్ధమైన రక్షణ కల్పించడం ద్వారా భవిష్యత్తుపై నెలకొన్న అనిశ్చితికి కేంద్రం ముగింపు పలికింది. ఇది అపూర్వ విజయం" అని పేర్కొన్నారు. కోట్లాది ఆంధ్రుల స్వప్నానికి అండగా నిలిచిన ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షాలకు సుజనా చౌదరి తన కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా, ఈ బిల్లుకు మద్దతు తెలిపిన ఎన్డీయే భాగస్వామ్య పక్షాలతో పాటు ఇతర రాజకీయ పార్టీల సభ్యులందరికీ ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. రాజధాని కోసం ప్రాణ త్యాగాలు చేసిన రైతులు, పోరాడిన ప్రజల వల్లే ఈ విజయం సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు.

**ఏపీకి శాశ్వత రాజధానిగా అమరావతి: ఎంపీ పురందేశ్వరి**

ఆంధ్రప్రదేశ్‌కు అమరావతి శాశ్వత రాజధానిగా ఉంటుందని భాజపా ఎంపీ పురందేశ్వరి అన్నారు. లోక్‌సభలో అమరావతికి చట్టబద్ధత బిల్లు ప్రవేశపెట్టిన సందర్భంగా నిర్వహించిన చర్చలో ఆమె మాట్లాడారు. "ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన ప్రక్రియ అరాచకంగా జరిగింది. ఆనాడు చర్చ లేకుండానే రాష్ట్ర విభజన చేశారు. పార్లమెంట్‌లో లైట్లు, కెమెరాలు ఆపి బిల్లు పాస్ చేశారు. చట్టాన్ని గౌరవించి విభజనను ప్రజలు అంగీకరించారు. ఆ తర్వాత ఏపీకి రాజధాని అవసరం వచ్చింది. రాజధాని లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ పాలన ప్రారంభమైంది. విభజన ఆగ్రహం నుంచి రాజధాని అమరావతి పుట్టింది. రాజధానికి 29వేల మంది రైతులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి భూములిచ్చారు. వైకాపా ప్రభుత్వం వచ్చాక అమరావతి భవితవ్యం అంధకారంలో పడింది. త్యాగం చేసిన రైతుల పట్ల గత ప్రభుత్వం అమానుషంగా ప్రవర్తించింది" అని పురందేశ్వరి అన్నారు.

## హిట్ అండ్ రన్ నేరాల కంటే ఘోరంగా

# ఓ పార్టీ రాజకీయాలు చేస్తోంది

నిర్మాణానికి కేంద్రానికి ప్రతిపాదనలు పంపిందని గుర్తు చేశారు. కానీ, ఇప్పుడు ఆ వాస్తవాలను వక్రీకరించి దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. కృష్ణపట్నం పోర్టును వాణిజ్యపరంగా మార్చినప్పుడు నాటి కాంగ్రెస్ పాలకులు పట్టించుకోలేదని అన్నారు. కూటమి ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధులు మత్స్యకారులకు ఎన్నడూ అన్యాయం చేయరని భరోసా ఇచ్చారు. ఏపీ జలాల్లోకి తమిళనాడు మత్స్యకారులు వచ్చి వేట చేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, ఈ విషయంలో పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలని నెల్లూరు, తిరుపతి కలెక్టర్లకు వేదిక నుంచే చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

**సంక్షేమ పథకాల వెల్లువ**

ప్రజలపై ఉన్న అభిమానంతోనే తమ ప్రభుత్వం పెద్ద ఎత్తున సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని చంద్రబాబు తెలిపారు. ప్రతి నెలా రూ.2,750 కోట్లను కేవలం పెన్షన్ల కోసమే వ్యయం చేస్తున్న ఏకైక రాష్ట్రం ఏపీ అని, పొరుగున ఉన్న తమిళనాడులో కేవలం రూ.1000 మాత్రమే ఇస్తున్నారని పోల్చి చెప్పారు. 'తల్లికి వందనం' కింద గత ఏడాది అందించిన ఆర్థిక సాయాన్ని మళ్లీ జూన్‌లో ఆడబిడ్డల ఖాతాల్లో జమ చేస్తామని ప్రకటించారు. 'దీపం 2.0' పథకం కింద ఏటా మూడు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా అందిస్తున్నామని, త్వరలోనే పైపులైన్ల ద్వారా ఇంటింటికీ గ్యాస్ సరఫరా చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వివరించారు.

**అభివృద్ధి, పెట్టుబడులే లక్ష్యం**

సంక్షేమంతో పాటు రాష్ట్రాభివృద్ధికి కూడా తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని చంద్రబాబు స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం రూ.1300 కోట్లు అడ్వాన్స్‌గా ఇచ్చిందని, గోదావరి పుష్కరాల నాటికి ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. నెల్లూరు జిల్లా పారిశ్రామికంగా వేగంగా అభివృద్ధి చెందుతోందని, రామాయపట్నం, దుగరాజపట్నం వంటి పోర్టులు రానున్నాయని తెలిపారు. ఉదయగిరిలో డ్రోన్లు, మానవ రహిత విమానాల తయారీ పరిశ్రమ రాబోతోందని, పెట్టుబడులకు ఏపీ గమ్యస్థానంగా మారిందని అన్నారు. ఇఫ్కో సెజ్ ద్వారా 80 వేల మందికి ఉద్యోగాలు వస్తాయని చెప్పారు.

**సుపరిపాలన - చేనేతలకు వరం**

సుపరిపాలన అందించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని చంద్రబాబు పునరుద్ఘాటించారు. ఈ మహాయజ్ఞానికి ఎవరు ఆటంకం కలిగించినా సహించేది లేదని, ప్రభుత్వ సేవల్లో లోపాలుంటే ఆకస్మిక తనిఖీలు చేస్తానని హెచ్చరించారు. డిసెంబరు నాటికి 4.5 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి గృహప్రవేశాలు చేయిస్తామన్నారు. ఈ సందర్భంగా, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు చేనేతలకు ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకం కింద 93 వేల చేనేత కుటుంబాలకు 200 యూనిట్లు, 11,443 పవర్‌లూమ్‌లకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తామని, ఇందుకోసం రూ.153 కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. అనంతరం, లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందించారు. ఈ సందర్భంగా చేనేతలు సీఎంను నూలు దండతో సత్కరించారు.

# తుక్కు నౌకలు.. మడ్డి చమురు..

విద్యుత్తు అవసరం. ఇక్కడే టెహ్రాన్ తెలివిగా ఆలోచించింది. చైనా సహకారంతో బిట్‌కాయిన్ మైనింగ్‌కు పెట్టుబడులను సాధించింది. 2019లో ఇరాన్‌లో క్రిప్టో మైనింగ్ చట్టబద్ధం చేసి.. లైసెన్స్‌లు జారీ చేయడం మొదలుపెట్టింది. వీరికి అవసరమైన విద్యుత్తును అధిక రేట్లకు విక్రయించింది. ప్రభుత్వ సాయంతో కూడా మైనింగ్ కొనసాగింది. ఇరాన్‌కు చెందిన రివల్యూషనరీ గార్డ్స్ కోర్ కూడా దీనిలో చురుకైన పాత్ర పోషించింది. ఇరాన్‌లో 2020లో బిట్‌కాయిన్ మైనింగ్‌కు 600 మెగావాట్ల విద్యుత్తును వాడినట్లు బైనాన్స్.కామ్ పేర్కొంది. ఇది కోటి బ్యారెళ్ల చమురుతో సమానం. ఇరాన్‌కు ఒక బిట్‌కాయిన్ మైనింగ్‌కు 1,300 డాలర్లు మాత్రమే ఖర్చవుతుందని అమెరికాకు చెందిన క్రిప్టో స్ట్రాటజిస్ట్ జాక్ పెర్సీ వెల్లడించారు. ఇదే అంతర్జాతీయ మార్కెట్లో 60,000-75,000 డాలర్ల మధ్యలో ట్రేడవుతోంది. పైగా దీనిపై అమెరికా డాలర్ వలే ప్రపంచ బ్యాంకింగ్ వ్యవస్థలోని అమెరికా ట్రెజరీ, స్విఫ్ట్ వ్యవస్థ ఆంక్షలు దీనిపై పనిచేయవు. 2025 నాటికి ఇరాన్ వద్ద 7.78 బిలియన్ డాలర్లు విలువైన క్రిప్టో సామ్రాజ్యం ఉన్నట్లు బ్లాక్‌చైన్ ఎనాలసిస్ సంస్థ అంచనా వేసింది. వీటిల్లో సగానికి పైగా ఐఆర్‌జీసీ నుంచే వచ్చాయి. ఒక్క 2025లోనే 3 బిలియన్ డాలర్ల విలువైన క్రిప్టోను తరలించేశారు. అమెరికా దాడులు మొదలయ్యాక.. ఇరాన్ అతిపెద్ద క్రిప్టో ఎక్స్ఛేంజి నోబిటెక్స్ నుంచి మొదటి మూడ్రోజుల్లో 10 మిలియన్ డాలర్ల విలువైన బిట్‌కాయిన్లు విదేశీ ఎక్స్ఛేంజిలకు వెళ్లిపోయాయి. ఇది ఆ ఎక్స్ఛేంజి సాధారణ సగటు కంటే 873% అధికం.

**తుక్కులో బంగారం..!**

పాత నౌకలను యజమానులు తుక్కు కింద విక్రయిస్తారు. ఇరాన్‌కు చెందిన డీలర్లు హాంకాంగ్, యూఏఈ వంటి దేశాల్లో వీటిని కొనుగోలు చేసి పెయింటింగ్, పేర్లు మార్పులు చేసి పనామా, మార్షల్ ఐలాండ్స్ వంటి చోట్ల రిజిస్టర్ చేస్తుంటారు. కొన్ని సందర్భాల్లో పాత నౌకలను అలానే చమురు లోడ్ చేసి వినియోగిస్తారు. కొన్ని సందర్భాల్లో అరేబియా సముద్రం మధ్యలో లేదా మలేసియా జలాల్లో పాత ట్యాంకర్ నుంచి మరో ట్యాంకర్ నౌకలోకి చమురును లోడింగ్ చేస్తుంటారు. ఒక ఏడాదిలో ఇరాన్ నుంచి ఈ షాడో ఫ్లీట్ 1,000 ట్రిప్స్ వేసినట్లు వాల్‌స్ట్రీట్ జర్నల్ ఈ ఏడాది జనవరిలో ప్రచురించిన కథనంలో వెల్లడించింది. కెప్లర్ అంచనాల ప్రకారం ఒక్క 2025లోనే ప్రపంచ వ్యాప్తంగా ఈ షాడో ఫ్లీట్ 3.7 బిలియన్ బ్యారెళ్ల చమురును తరలించి ఉంటుందని కెప్లర్ అంచనా వేసింది. వీటిలో ఇరాన్, రష్యా, వెనుజువెలా చమురే అత్యధికం. ఈ ఏడాది ఫిబ్రవరిలో భారత్ ఇటువంటి నౌకలనే భారత కోస్ట్‌గార్డ్ అడ్డుకొన్న విషయం తెలిసిందే.

**చమురు సంపదను నిర్వహించేది ఎవరు..?**

ఇరాన్ చమురు, ఆయుధాలు, ఆదాయం మొత్తం నెట్‌వర్క్‌ను దుబాయ్ కేంద్రంగా 'హెచ్' లేదా హెక్టార్ పేరిట పిలిచే వ్యక్తి నిర్వహిస్తున్నట్లు బ్లూమ్‌బెర్గ్ పరిశోధనాత్మక కథనంలో వెల్లడించింది. ఈ వ్యక్తి ఎవరో కాదు.. హుస్సేన్ షంఖానీ అని బ్లూమ్‌బెర్గ్ ధ్రువీకరించుకొంది. ఇరాన్‌లో ఖమేనీ తర్వాత అత్యంత శక్తిమంతమైన నేతల్లో ఒకరైన అలీ షంఖానీ తనయుడు. ఖమేనీపై దాడి జరిగిన రోజే అలీ కూడా మృతి చెందారు. వాస్తవానికి అలీ ఇరాన్-ఇరాక్ యుద్ధంలో నౌకాదళాన్ని కమాండ్ చేశారు. ఆ తర్వాత ఇరాన్‌లో చాల కీలకమైన వ్యక్తిగా ఎదిగి నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యదర్శి స్థాయికి చేరారు.

**విభిన్నమైన వ్యవస్థ..**

ఇరాన్ చమురు ఆధారిత ఆర్థిక వ్యవస్థ. అక్కడ ఆయిల్‌పై ఎవరి పెత్తనం ఉంటే వారిదే అధికారం. ఆ దేశంలో విప్లవానికి కూడా చమురే ఓ రకంగా కారణం. ఇరాన్ -ఇరాక్ యుద్ధం తర్వాత ఐఆర్‌జీసీ అనుకున్నదాని కంటే బలంగా తయారై విస్తరించింది. వివిధ రంగాల్లో అడుగుపెట్టింది. ఇరాన్ పాలనలో హైబ్రీడ్ విధానం కనిపిస్తుంది. కొంత ప్రభుత్వ పాలనలో ఉంటే.. మరికొంత శక్తిమంతమైన అధికారుల కుటుంబాల వద్ద ఉంటుంది. అఘూజాదే (ఉన్నత వర్గం పిల్లలు) అనే వ్యవస్థను ఇరాన్ అనుసరిస్తుంది. శక్తిమంతమైన స్థానాల్లో వారి కుటుంబ సభ్యులు కీలక స్థానాల్లో ఉంటారు. ఇక్కడ నియామకాలకు విశ్వసనీయతే ప్రామాణికం. వీరే విదేశాల్లో ఇరాన్ కార్యక్రమాలను చక్కబెడుతుంటారు. హుస్సేన్ షంఖానీ ఈ కోవలోని వ్యక్తే.

## మొదటి పేజీ తరువాయి

### లోక్ సభలో అమరావతి బిల్లు పాస్..

## టీవీ లైవ్ చూసి చప్పట్లు కొట్టిన లోకేశ్...

ఆశీస్సులని, శాంతియుత పోరాటానికి లభించిన ఫలితమని పేర్కొన్నారు. అమరావతి బిల్లుకు మద్దతుగా నిలిచిన కేంద్ర ప్రభుత్వానికి, ఇతర పార్టీలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆంధ్రుల ఆత్మగౌరవ రాజధానిగా అమరావతి నిలిచిందని పేర్కొంటూ, "జై ఆంధ్రప్రదేశ్.. జయహో అమరావతి" అని నినదించారు. "అమరావతి చట్టబద్ధత బిల్లుపై లోక్ సభలో జరిగిన చర్చ మొత్తం టీవీలో చూశాను. ఉత్కంఠ రేపింది. అమరావతి చరిత్ర-సంస్కృతి, ఆవశ్యకత సభ్యులు వివరిస్తుంటే ఒక ఆంధ్రుడిగా రోమాలు నిక్కబొడుచుకున్నాయి. కేంద్ర ప్రభుత్వం, దేశంలోని వివిధ పార్టీలు నిలవడం ఐదుకోట్ల ఆంధ్ర ప్రజల ఆకాంక్షకు అద్దం పట్టింది. లోక్ సభ వేదికగా అమరావతి గొప్పతనం దేశమంతటికీ మరోసారి పరిచయమైంది. దేశ రాజధాని ఢిల్లీలో ప్రజాస్వామ్య దేవాలయం పార్లమెంటులో చరిత్ర సృష్టించిన అమరావతి చట్టబద్ధత బిల్లు చర్చలో పాల్గొనకుండా వైసీపీ సభ్యులు వాకౌట్ చేయడం వారి ద్రోహబుద్ధికి నిదర్శనం. జగన్ ఎన్ని జన్మలెత్తినా అమరావతిలో ఒక్క ఇటుకనూ తాకలేడు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధినీ ఆపలేడు. నా రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ శాశ్వతం, నా రాజధాని అమరావతి అజరామరం" అంటూ లోకేశ్ ఓ ప్రకటన కూడా విడుదల చేశారు.

## తేయాకు ఆకులు కోసి, కార్మికులతో సెల్ఫీ దిగిన ప్రధాని నరేంద్రమోదీ

పలికారు.

**బహిరంగ సభలో రాహుల్ గాంధీపై విమర్శలు**

అసోం అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గోగముఖ్‌లో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. అసోంలో బీజేపీ మూడోసారి గెలిచి హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని ప్రధాని మోదీ ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ యువరాజు రాహుల్ గాంధీకి వందోసారి ఓటమి తప్పదని ఎద్దేవా చేశారు. అసోం మాజీ సీఎం శర్బానంద సోనోవాల్, ప్రస్తుత ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి చెందిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ విభజన విధానాలను అనుసరిస్తోందని ఆరోపించారు. అసోంలో ఉమ్మడి పౌర స్మృతిని అమలు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ఆదివాసీల హక్కులను కాపాడుతామని హామీ ఇచ్చారు.

## రెండ్రోజుల తర్వాత మళ్లీ కళకళలాడిన భారత స్టాక్ మార్కెట్లు

సెషన్ చివరి గంటల్లో ఆ ఉత్సాహం కొంత తగ్గడంతో సూచీలు ఆరంభ లాభాల్లో కొంత భాగాన్ని కోల్పోయాయి. అయినప్పటికీ, చివరికి ప్లస్‌లోనే ముగియగలిగాయి.

**బెంచ్‌మార్క్ సూచీలతో పోలిస్తే బ్రాడర్ మార్కెట్లు మరింత మెరుగ్గా రాణించాయి.**

నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 2.24 శాతం, నిఫ్టీ స్మాల్‌క్యాప్ సూచీ 3.24 శాతం చొప్పున పెరిగాయి. రంగాలవారీగా చూస్తే, నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ ఇండెక్స్ అత్యధికంగా లాభపడింది. కెమికల్, మీడియా రంగాల్లోనూ కొనుగోళ్ల మద్దతు కనిపించింది. అయితే, మార్కెట్ ట్రెండ్‌కు విరుద్ధంగా నిఫ్టీ హెల్త్‌కేర్, ఫార్మా రంగాలు నష్టాలతో ముగియడం గమనార్హం. టెక్నికల్ అంశాలపై విశ్లేషకులు స్పందిస్తూ, నిఫ్టీ 22,500 స్థాయిని నిలబెట్టుకోకపోతే అమ్మకాల ఒత్తిడి పెరిగే అవకాశం ఉందని తెలిపారు. ఎగువన 23,000 స్థాయి కీలక నిరోధకంగా పనిచేస్తుందని పేర్కొన్నారు. మార్కెట్ల తదుపరి కదలికలు అమెరికా నుంచి వెలువడనున్న నాన్-ఫార్మ్ పేరోల్స్, నిరుద్యోగిత రేటు వంటి కీలక గణాంకాలపై ఆధారపడి ఉంటాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

### అమరావతి బిల్లుకు లోక్‌సభ ఆమోదం..

## ఇది చారిత్రాత్మక ఘట్టమన్న పవన్ కల్యాణ్

త్యాగాన్ని పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా స్మరించుకున్నారు. "తరతరాలు గుర్తుంచుకునేలా, అపారమైన విశ్వాసంతో 33,000 ఎకరాలకు పైగా భూములను రాజధాని కోసం త్యాగం చేసిన రైతులకు నా ప్రగాఢ గౌరవాన్ని, కృతజ్ఞతలను తెలియజేస్తున్నాను" అని పేర్కొన్నారు. అదే సమయంలో, అమరావతికి బలమైన పునాది వేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనిక నాయకత్వాన్ని మనస్ఫూర్తిగా కొనియాడారు. ఈ బృహత్ కార్యం వాస్తవరూపం దాల్చడానికి నిరంతరం మద్దతుగా నిలుస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, కేంద్ర ఎన్డీయే ప్రభుత్వానికి పవన్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. గత ప్రభుత్వ తిరోగమన, ఏకపక్ష నిర్ణయాల వల్ల రాష్ట్రం తీవ్రమైన సవాళ్లను ఎదుర్కొందని పవన్ విమర్శించారు. రైతుల పోరాటాలు, మహిళల ఆవేదన, యువత భవిష్యత్తుపై నెలకొన్న అనిశ్చితి వంటి క్లిష్ట పరిస్థితుల్లోనూ రాష్ట్ర ప్రజలు అసాధారణమైన ధైర్యాన్ని, స్పష్టతను ప్రదర్శించారని కొనియాడారు. స్థిరమైన ఎన్డీయే ప్రభుత్వాన్ని ఎన్నుకోవడం ద్వారా ప్రజలు అభివృద్ధికి, సుస్థిరతకు పట్టం కట్టారని అన్నారు. పార్లమెంటు ఆమోదంతో రాష్ట్ర ప్రజల్లోనే కాకుండా, పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారుల్లోనూ బలమైన, పునరుత్తేజంతో కూడిన విశ్వాసం ఏర్పడిందని పవన్ అభిప్రాయపడ్డారు. అమరావతి కేవలం రాజధానిగానే కాకుండా, రాష్ట్ర ప్రజల ఆశ, సంకల్పం, సమష్టి కృషికి ప్రతీకగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. 2047 నాటికి స్వర్ణాంధ్రప్రదేశ్, ప్రధాని మోదీ ఆవిష్కరించిన వికసిత భారత్ లక్ష్యాల సాధనలో అమరావతి కీలక పాత్ర పోషిస్తుందని ఆయన దృఢ విశ్వాసం వ్యక్తం చేశారు.

# భక్తులకు వాసుపల్లి సాయం



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఏప్రిల్ 01**

నగరంలోని దక్షిణ నియోజకవర్గం 30వ వార్డు కోడిపందాల వీధిలో ఉన్న శ్రీసుబ్రమణ్య స్వామివారి చైత్ర పౌర్ణమి మహోత్సవాల్లో మాల ధరించిన భక్తులకు మాజీ ఎమ్మెల్యే దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త ?10,000/- రూపాయలు విరాళం అందజేశారు. ఆసీలమెట్ట కార్యాలయంలో బుధవారం వార్డు ప్రెసిడెంట్ దశమంతల మాణిక్యాలరావు తో కలిసి వారంతా వాసుపల్లి గణేష్ కుమార్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. స్వామి వారి వేడుకలకు మాల దీక్షలు విరమణకు సంబంధించి సాయం అందజేశారు. మార్చి నెలలో చైత్ర పౌర్ణమి వేడుకలు పురస్కరించుకొని శ్రీ సుబ్రహ్మణ్య స్వామిని స్థానికులు ఎంతో భక్తి శ్రద్ధలతో మాల ధరించి ఆరాధిస్తారన్నారు. వారికి తన వంతు సాయంగా సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని వాసుపల్లి తెలిపారు. యూత్ ప్రెసిడెంట్ బంగారు బాబ్జి మాట్లాడుతూ దీక్షల ముగించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహిస్తామని, తమకు సహాయ సహకారాలు అందించిన వాసుపల్లి గణేష్ కుమార్ కి కృతజ్ఞతలు తెలియజేశారు.

# పరిపాలన బాగుంది



**మాధవరం:( సిటిజన్ టైమ్స్): ఏప్రియల్:01**

తిరువూరు నియోజక వర్గం, ఏ కొండూరు మండలం, మాధవరం గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కో మటి. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం కంటే కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రాష్ట్రంలో ఒకవైపు అభివృద్ధి, మరోవైపు అర్హులైన ప్రతి ఒక్క కుటుంబానికి కులం, మతం, భాష , పార్టీ బేధం లేకుండా సూపర్ సిక్స్ పథకాలు అందాయని అన్నారు. అదేవిధంగా ఆ పంచాయతీలో ఎంతమందికి పింఛన్లు ఇస్తున్నారో తెలిపారు. వీధి దీపాలు, నీటి సౌకర్యం, సీసీ రోడ్లు మొదలైనవి బాగానే ఉన్నాయని వివరణ అందించారు. నిరుపేదలకు ఇళ్ళు, డ్రైనేజీ సమస్య కొరత ఉందని ప్రభుత్వం గుర్తించి తక్షణమే వాటిని అమలు పరచాలని కోరారు . ప్రజలందరూ కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారని సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఎప్పుడు ఎలక్షన్ లు జరిగిన కూటమి ప్రభుత్వానిదే గెలుపు అని స్పష్టం చేశారు.

# అమరావతికి అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు

**ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి వల్లే ఇదంతా సాధ్యమైంది**

**అమరావతి రైతుల తరఫున సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు**



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 01:-**

అమరావతి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపినందుకు ప్రధాని నరేంద్ర మోదీకి హోంమంత్రి అనిత ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి వల్లే ఇదంతా సాధ్యమైందన్నారు. అమరావతి రైతుల తరఫున సీఎం చంద్రబాబుకు హోంమంత్రి కృతజ్ఞతలు తెలియజేశారు. అమరావతిపై పోరాడి విజయం సాధించిన రైతులకు అభినందనలు తెలిపారు. అమరావతికి అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఇది రైతుల త్యాగాలకు, శాంతియుత పోరాటానికి దక్కిన ఫలితమన్నారు. అమరావతిని అంగుళం కూడా వేరొకరు కదిపే పరిస్థితి లేకుండా కట్టుదిట్టంగా చట్టాలు, శాసనాలతో ఏర్పాటు చేసిన ఘనత కూటమి ప్రభుత్వం సొంతమన్నారు. ఆంధ్రుల ఆత్మగౌరవ రాజధానిగా అమరావతిని పునఃప్రతిష్ఠించిన కేంద్ర ప్రభుత్వానికి, మద్దతుగా నిలిచిన అన్ని పక్షాలకు హోంమంత్రి అనిత ధన్యవాదాలు తెలిపారు.

# శబల ఆహారమే ఆరోగ్యకరం

## ప్రకృతి ఆధారంగా పండించిన పంటలే ఆరోగ్యకరం

## రసాయనాలతో భూమిని సర్వనాశనం చేయవద్దు -అతిథి, శాసనసభ్యులు, విజయనగరం

**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఏప్రిల్ 01**

శబల ఆహారమే ఆరోగ్యకరం అని విజయనగరం శాసనసభ్యులు అతిథి వివరించారు. బుధవారం ఉదయం సింహాచలం గోశాల లో సేవ్ సంస్థ నిర్వహించిన శబల భోజనాలు పండుగ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ హితంగా జీవించాలి అని కోరారు. ప్రకృతి ఆధారంగా పండించిన పంటలే ఆరోగ్యకరం, ఆనందదాయకం అని వివరించారు. రసాయనాలతో భూమిని సర్వనాశనం చేయవద్దు అని పిలుపునిచ్చారు. అలాగే మన గాలి, నీరు, ఆహారం ఆరోగ్యకరమైనవిగా ఉండాలని అన్నారు. వీఎం ఆర్ డి ఎ మెట్రో పొలిటిన్ కమిషనర్ తేజ్ భరత్ మాట్లాడుతూ శబల భోజనాలు పండుగ కు రావటం తన అదృష్టమని భావిస్తున్నానన్నారు. ఈ విధమైన ఆహారం భుజించడం, ప్రకృతి ఆధారంగా పంటలు పండించడం చాలా గొప్ప విషయం అని పేర్కొన్నారు. రైతులు అందరూ ఈ విధంగా పంటలు పండించడం అలవర్చుకోవాలి అని కోరారు. పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ ప్రకృతి కోసం పని చేయడం చాలా గొప్ప విషయం అని వివరించారు. వేలాది మంది ప్రకృతి ఆధారంగా పంటలు పండించే రైతులు అత్యధిక సంఖ్యలో కలిసి







నిర్వహిస్తున్న ఈ పండుగ వెయ్యేళ్ల క్రితం ఏ విధంగా పంటలు పండించి ఆరోగ్యకరంగా అందరూ కలిసి మెలిసి జీవించే వారో ఆ విధంగా ఈ రోజు ఇక్కడ ఒక ఆనందదాయకం అయిన పరిస్థితి ఉంది అన్నారు. ఇటువంటి కార్యక్రమాలు అధికం గా నిర్వహించాలి అని కోరారు. ఈ కార్యక్రమంలో సింహాచలం దేవస్థానం ఇఓ జె వెంకటరావు, సేవ్ సంస్థ వ్యవస్థాపకులు విజయరాం, మిల్లెట్స్ రాంబాబు, సంకల్ప కళా గ్రామం వ్యవస్థాపకులు ఆకుల చలపతిరావు, తులసి నేచురల్స్ సత్యనారాయణ, ప్రకృతి రైతులు శ్రీనాథ్ , విశ్రాంత ప్రొఫెసర్ సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ప్రధానంగా ఈ పండుగ లో మహేష్ అనే రైతు కాంక్రీజ్, థార్ పార్కర్, పుంగనూరు, సాహీవాలీ, రాఠీ సంతతి కి చెందిన ఆవులు ప్రదర్శించారు. గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ, పిఠాపురం నుంచి వచ్చిన బాలు, ధాన్యం కంకులతో కుచ్చులు తయారీ శిక్షణ ఇవ్వడం జరిగింది. అలాగే తాటాకు చాపలు అల్లడం, మట్టి తో కుండలు ఊనడం, వెదురు బుట్టలు అల్లడం, కొబ్బరి ఆకులతో బొమ్మలు తయారు చేయడం, తాటాకు మట్ట తో మంచం నేయడం జరిగింది.

## ప్రజల పోలీస్‌గా సీపీ...

# విశాఖలో భద్రతకు భరోసా



**సిటిజన్ టైమ్స్ విశాఖపట్నం ఏప్రిల్ 01**

విశాఖపట్నం నగర పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత డా. శంక బ్రాతా బాగ్చి ఐ.పీ.ఎస్ నేతృత్వంలో నగరంలో చట్టం, శాంతి భద్రతల పరిరక్షణలో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయి. కఠిన చర్యలు, సమర్థవంతమైన పర్యవేక్షణతో విశాఖలో భద్రతా వాతావరణం బలోపేతం అయిందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ప్రత్యేకంగా గంజాయి ముఠాలు, రౌడీ బ్యాచ్‌లపై ఉక్కుపాదం మోపుతూ నేర కార్యకలాపాలపై గట్టి దెబ్బ కొట్టారు. గంజాయి రవాణా, విక్రయాల నియంత్రణపై దృష్టి సారించడం, రౌడీషీటర్ల కదలికలను కట్టడి చేయడం ద్వారా నేరగాళ్లలో భయాన్ని కలిగించగా, నగరంలో క్రైమ్ రేటు గణనీయంగా తగ్గుముఖం పట్టినట్లు విశ్లేషకులు చెబుతున్నారు. ఇదే సమయంలో ప్రజల సమస్యల పరిష్కారంలోనూ విశాఖ పోలీస్‌లు ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. పి.జి.ఆర్.ఎస్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను వేగంగా పరిష్కరించడం, దొంగతనాల్లో పోయిన నగదు, బంగారం, వాహనాలను తిరిగి స్వాధీనం చేసుకుని బాధితులకు అందించడం ద్వారా ప్రజల్లో పోలీస్ వ్యవస్థపై విశ్వాసం పెరిగింది. నగర భద్రతను మరింత పటిష్టం చేసే దిశగా సీపీ స్వయంగా పోలీస్ స్టేషన్లను అకస్మికంగా తనిఖీ చేస్తూ, అధికారులకు దిశానిర్దేశం చేస్తూ పని తీరు మెరుగుపరచడానికి కృషి చేస్తున్నారు. గ్రౌండ్ స్థాయిలో పరిస్థితులను తెలుసుకుంటూ తీసుకుంటున్న నిర్ణయాలు ఫలితాల రూపంలో కనిపిస్తున్నాయి. ఇక సేవా దృక్పథంలో భాగంగా విశాఖ పోలీస్‌లు చేపట్టిన 'జ్యోతిర్గమయ' కార్యక్రమం ప్రత్యేక ప్రస్తావనీయంగా నిలిచింది. డా. శంక బ్రాతా బాగ్చి ఐపీఎస్ చొరవతో ప్రారంభమైన ఈ కార్యక్రమం ద్వారా వృద్ధులు, బిక్షాటన చేస్తున్నవారిని గుర్తించి రక్షిస్తూ, వారికి ఆశ్రయం కల్పించేందుకు విశాఖలో షెల్టర్ హోమ్‌లు ఏర్పాటు చేయడం జరిగింది. చీకటి జీవితాల నుంచి వెలుగులోకి తీసుకురావాలనే లక్ష్యంతో చేపట్టిన ఈ కార్యక్రమం సామాజిక బాధ్యతకు నిదర్శనంగా నిలిచింది. ప్రజలతో సాన్నిహిత్యం పెంచుతూ, గౌరవంతో వ్యవహరించడం, సమస్యలను వినడం, వెంటనే స్పందించడం వంటి చర్యలతో విశాఖ పోలీస్‌లు "ప్రజల పోలీస్"గా గుర్తింపు పొందుతున్నారు. సాంకేతికతను వినియోగిస్తూ నిఘా వ్యవస్థను బలోపేతం చేయడం, వేగవంతమైన విచారణల ద్వారా కేసులను త్వరగా ఛేదించడం, పారదర్శకతతో వ్యవహరించడం వంటి అంశాలు పోలీస్ శాఖకు ప్రత్యేక గుర్తింపును తెచ్చాయి. ఈ సేవా దృక్పథానికి గుర్తింపుగా విశాఖ ప్రజలు "గ్రేట్ సీపీ సార్" అంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు. ప్రజల భద్రత, న్యాయం, శాంతి భద్రతలను కాపాడడంలో చూపుతున్న నిబద్ధత రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమవుతోంది. విశాఖలో అమలవుతున్న ఈ కఠినమైన, బాధ్యతాయుతమైన పోలీసింగ్ విధానం ఇతర ప్రాంతాలకు కూడా ఆదర్శంగా నిలుస్తుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# మానవత్వం చాటుకున్న పోలీస్ శాఖ

***దివంగత హోం గార్డు కుటుంబానికి***

***రూ.4.24 లక్షల ఆర్థిక సాయం***

***అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, ఐపీఎస్ చేతుల మీదుగా చెక్కు అందజేత***



**సిటిజన్ టైమ్స్ అనకాపల్లి, ఏప్రిల్ 1**

విధులపట్ల నిబద్ధతతో ఉంటూ, అనారోగ్యంతో అకాల మరణం చెందిన హోం గార్డు డి.వి.వెంకటరావు కుటుంబాన్ని అనకాపల్లి జిల్లా పోలీసులు అండగా నిలిచి ఆదుకున్నారు. విశాఖ ఆర్.ఐ.ఎన్.ఎల్ స్టీల్ ప్లాంట్‌లో డిప్యూటేషన్‌పై విధులు నిర్వర్తిస్తూ మరణించిన వెంకటరావు కుటుంబానికి, జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, ఐపీఎస్ బుధవారం తన కార్యాలయంలో రూ.4,24,120/- ఆర్థిక సహాయాన్ని అందజేశారు. సహృదయంతో స్పందించిన తోటి హోం గార్డులు ?ఈ ఆర్థిక సాయం వెనుక అనకాపల్లి మరియు అల్లూరి సీతారామరాజు జిల్లాల హోం గార్డుల సామాజిక స్పృహ ఉంది. తమ తోటి ఉద్యోగి కుటుంబాన్ని ఆదుకోవాలనే ఉద్దేశంతో ?ఉభయ జిల్లాల హోం గార్డులు తమ ఒక రోజు డ్యూటీ అలవెన్స్‌ను స్వచ్ఛందంగా విరాళంగా ప్రకటించారు. ఇతర రూపాల్లో సేకరించిన నిధులతో కలిపి మొత్తం రూ.4,24,120/- మొత్తాన్ని సమకూర్చారు. ఈ సందర్భంగా మరణించిన హోం గార్డు భార్య దాసరి నీలిమ కు చెక్కును అందజేస్తూ, ఎస్పీ ఆమెను ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "డి.వి.వెంకటరావు మరణం పోలీసు శాఖకు తీరని లోటు. వారి కుటుంబానికి పోలీసు విభాగం ఎల్లప్పుడూ అండగా ఉంటుంది. తోటి సిబ్బంది ఆపదలో ఉన్నప్పుడు తోటి హోం గార్డులు స్పందించి సాయం చేయడం అభినందనీయం. విధి నిర్వహణలో మరణించినా లేదా పదవీ విరమణ పొందినా సిబ్బంది సంక్షేమానికి మేము ప్రాధాన్యతనిస్తాం అని ఈ సందర్భంగా ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ.ఓ సి.హెచ్.తిలక్ బాబు, ఆఫీస్ సూపరింటెండెంట్ దేవరాజు, జూనియర్ అసిస్టెంట్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## విశాఖ అభివృద్ధికి.. ప్రజల సంక్షేమానికి

# కంకణబద్ధుడినై పనిచేస్తా...

## బుధవారం మధ్యాహ్నం బాధ్యతలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్

**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఏప్రిల్ 01**

విశాఖపట్నం జిల్లా అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి కంకణబద్ధుడినై పని చేస్తానని, ప్రతి పథకం నిజమైన లబ్ధిదారులకు చేరేలా, అభివృద్ధి ఫలాలు అందరికీ అందేలా కృషి చేస్తానని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ పేర్కొన్నారు. నూతన కలెక్టర్ గా బుధవారం మధ్యాహ్నం తన ఛాంబర్లో బాధ్యతలు స్వీకరించిన ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా సమగ్ర అభివృద్ధి తన ప్రాధాన్యతగా ఉంటుందని స్పష్టం చేశారు. విశాఖపట్నం రాష్ట్రానికి మాత్రమే కాకుండా దేశానికి కూడా కీలకమైన ఆర్థిక, పారిశ్రామిక, ఐటీ కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న నగరమని అన్నారు. జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేయడానికి కట్టుబడి ఉన్నానన్నారు. ముఖ్యంగా ఐటీ, పరిశ్రమలు, డేటా సెంటర్లు, టూరిజం రంగాల్లో మరింత పెట్టుబడులను ఆకర్షించే దిశగా చర్యలు తీసుకుంటానని చెప్పారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఉపాధి అవకాశాల సృష్టి, పట్టణ, గ్రామీణ ప్రాంతాల సమతుల్య అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, ఆ దిశగా శాయశక్తులా పని చేస్తానని ఉద్ఘాటించారు. ప్రజలతో నేరుగా మమేకమై, వారి సమస్యలను తెలుసుకుని వేగంగా పరిష్కరించడం తన ప్రధాన బాధ్యతగా భావిస్తున్నానని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రతి ప్రాంతాన్ని సందర్శించి, స్థానిక అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందిస్తానని చెప్పారు. భోగాపురం విమానాశ్రయం ప్రారంభం, పోర్టు ఆధారిత అభివృద్ధి, పరిశ్రమల విస్తరణ వంటి అంశాలు విశాఖపట్నం అభివృద్ధికి కొత్త దిశను తీసుకువస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ అవకాశాలను సమర్థంగా వినియోగించుకుని జిల్లాను రాష్ట్ర అభివృద్ధికి మార్గదర్శకంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. జిల్లా యంత్రాంగంతో సమన్వయంతో పనిచేస్తూ పారదర్శకత, సమర్థతతో పరిపాలన అందించేందుకు కట్టుబడి ఉంటానని పేర్కొన్నారు. ఈ అభివృద్ధి ప్రయాణంలో ప్రజల సహకారం అత్యంత కీలకమని, అందరూ కలిసి



విశాఖపట్నాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. తాను ఆంధ్రావాడినేనని, తన స్వస్థలం నెల్లూరు అని, అమ్మానాన్నా ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగులే అని కలెక్టర్ తెలిపారు. ఇప్పటి వరకు వివిధ హోదాల్లో సేవలందించానని, తూర్పు గోదావరి, ప్రకాశం జిల్లాల్లో సబ్ కలెక్టర్ గా, ఐటీడీఏ పీవోగా, మున్సిపల్ కమిషనర్ గా, జాయింట్ కలెక్టర్ గా పని చేసినట్లు వివరించారు. అలాగే అన్నమయ్య జిల్లా కలెక్టర్ గా, ఫైనాన్స్, కమిర్షియల్ టాక్స్, ఇండస్ట్రీస్ విభాగాల్లో సేవలందించానని చెప్పారు. విశాఖ జిల్లాకు రావటం ఆనందంగా ఉందన్నారు. ముఖ్యమంత్రికి, ప్రభుత్వానికి ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నా అని అభిషిక్త్ కిశోర్ అన్నారు.





## ప్రజలకు న్యాయ అవగాహన చేరవేయడంలో

# "సిటిజన్ టైమ్స్" కొత్త అడుగు

**సిటిజన్ టైమ్స్ ఎడిటర్**

సమాజానికి ఉపయోగపడే అంశాలను ముందుకు తీసుకు వస్తూ, ప్రజల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ వస్తున్న "సిటిజన్ టైమ్స్" పత్రిక మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు జాతీయ, అంతర్జాతీయ, రాజకీయ విశ్లేషణలతో పాటు ప్రజలలో చైతన్యం కలిగించే ప్రత్యేక కథనాలను అందించిన ఈ పత్రిక, ఇకపై న్యాయ అవగాహనపై ప్రత్యేక దృష్టి సారించనుంది. భారతీయ న్యాయవ్యవస్థలో ఉన్న చట్టాలు, వాటి ప్రాముఖ్యత, సాధారణ ప్రజలకు సంబంధించిన హక్కులు మరియు బాధ్యతలను సులభమైన భాషలో ప్రజలకు చేరవేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు పత్రిక యాజమాన్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా న్యాయవాదులతో కలిసి "సిటిజన్ టైమ్స్" లీగల్ టీమ్ పని చేయనుండగా, చట్టాలపై పూర్తి అవగాహన కల్పించే ప్రత్యేక కథనాలు త్వరలో పాఠకుల ముందుకు రానున్నాయి. ఇప్పటివరకు పత్రికకు లభించిన ప్రజాదరణ, ఆదరణకు కృతజ్ఞతలు తెలుపుతూ, భవిష్యత్తులో కూడా మరింత నాణ్యమైన, ఉపయోగకరమైన సమాచారం అందించేందుకు కట్టుబడి ఉన్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

# ప్రభుత్వ భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

### సీఎంఓ కార్యాలయం మరియు పిజిఆర్ఎస్ లో వచ్చిన దరఖాస్తులపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చేపట్టాలి

### రెవెన్యూ అధికారుల సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్






**అనకాపల్లి,సిటిజన్ టైమ్స్,ఏప్రిల్ 1**

జిల్లాలోని ప్రభుత్వ భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ ఆదేశించారు. బుధవారం ఉదయం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో, జిల్లా జాయింట్ కలెక్టర్ సౌర్య మాన్ పటేల్ తో కలిసి జిల్లా కలెక్టర్ పాల్గొని అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న భూముల తాలూక తాజా పరిస్థితులను తెలుపుతూ నివేదికలు సమర్పించాలని, సంక్లిష్ట పరిస్థితులకు సంబంధించి తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పట్టాదార్ పాస్ బుక్స్ పంపిణీ, రీ సర్వే, వెబ్ ల్యాండింగ్ పోర్టింగ్, తదితర అంశాలపై నిర్వహించాల్సిన విధి విధానాల గురించి ప్రస్తావించారు. మ్యుటేషన్ల ప్రక్రియలో జాప్యాన్ని నివారించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జీవో ఎంఎస్ నెంబర్ 30 ప్రకారం అందరికీ ఇల్లు కార్యక్రమంపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. సీఎంఓ కార్యాలయం నుండి మరియు పిజిఆర్ఎస్ లో వచ్చిన దరఖాస్తులపై అధికారులు స్వయంగా పరిశీలించి చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. 22ఏ పెండింగ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకుని త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఎన్హెచ్ -5 నకు ఆనుకొని ఉన్న భూములను గుర్తించాలని తెలిపారు. కోర్టు కేసుల విషయంలో అధికారుల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. చౌక ధరల దుకాణాలు, పెట్రోలు బంకులను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. చౌక ధరల దుకాణాలకు మహిళలు పిల్లలు వచ్చినట్లయితే ముందుగా వారికి సరుకులు పంపిణీ చేయాలని, మంచి నీరు ఏర్పాటు చేయాలని, వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో చర్చించి ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. జిల్లాలో గ్యాస్ కొరత లేదని, గ్యాస్ ఏజెన్సీలలో ముందస్తు బుకింగ్స్ లేకుండా చూడాలని, గ్యాస్ సిలిండర్లను డోర్ డెలివరీ ద్వారా మాత్రమే అందజేయాలని, గ్యాస్ గోడౌన్ వద్ద ఎటువంటి డెలివరీలు లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. గనులు క్వారీలపై అధికారులు సమన్వయంతో ముందుకు వెళ్లాలన్నారు. జిల్లాలో ఫైర్ క్రాకర్ యూనిట్ల కు సంబంధించిన తనిఖీ నివేదికలను సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వై. సత్యనారాయణ రావు, అనకాపల్లి నర్సీపట్నం రెవిన్యూ డివిజనల్ అధికారులు వివి రమణ, షేక్ ఆయేషా, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, సర్వే శాఖ ఏడీ, డీఎస్ఓ, పలువురు తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు, పలువురు రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఏప్రిల్ 4న సౌత్ జోన్ లో బహిరంగ వేలం నిర్వహణ

### - సౌత్ జోనల్ కమిషనర్ ఎమ్. మల్లయ్య నాయుడు.



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఏప్రిల్ 01**

మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ సౌత్ జోన్ లో మార్కెట్ లకు, కళ్యాణ మండపములకు, షాపు రూములకు ఏప్రిల్ 4వ తేదిన ఉ.గం.11.00 లకు సౌత్ జోన్ జోనల్ కార్యాలయం నందు బహిరంగ వేలం పాట నిర్వహించడం జరుగునని సౌత్ జోన్ జోనల్ కమిషనర్ ఎమ్.మల్లయ్య నాయుడు బుధవారం పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. సౌత్ జోన్ పరిధిలో ఉన్న శ్రీనగర్ రోడ్ సైడ్ మార్కెట్, నెహ్రూ బజార్ డైలీ మార్కెట్, రెల్లివీధి రోడ్ సైడ్ ఫిష్ మార్కెట్, కళ్యాణ మండపములు, షాపు రూములకు 2026-2027 సంవత్సరం గాను తేది 01-04-2026 నుండి లేదా ఇచ్చిన తేది నుండి తేది 31-03-2027 వరకు గుత్తకు ఇచ్చేందుకు తేదీ 04-04-2026 ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం పాట నిర్వహించబడునని జోనల్ కమిషనర్ తెలిపారు. సదరు వేలంపాటలో పాల్గొనదలచిన వారు దరావత్తు సొమ్ము తదితర పూర్తి వివరాలకు సౌత్ జోన్ జోనల్ కార్యాలయం పని వేళలో పర్యవేక్షకులను సంప్రదించగలరని జోనల్ కమిషనర్ తెలిపారు.

## గంటాను కలిసిన డైరక్టర్ సుకుమార్

**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 1:**

భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును స్టార్ డైరక్టర్ సుకుమార్ ఎంవీపీ కాలనీ నివాసంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తెలుగు సినీ పరిశ్రమ అభివృద్ధికి సంబంధించిన అంశాలు వారు మధ్య చర్చకు వచ్చాయి. విశాఖ సినిమా షూటింగ్ లకు అనువైన ప్రదేశమని పేర్కొన్నారు. బ్లాక్ బస్టర్ సినిమాలతో దేశవ్యాప్త క్రేజ్ తీసుకువచ్చిన సుకుమార్ భవిష్యత్ లో మరిన్ని సక్సెస్ ఫుల్ సినిమాలు తియ్యాలని గంటా ఆకాక్షించారు. సుకుమార్ ను శాలువా కప్పి సన్మానించారు. మైత్రి మూవీ మేకర్స్ నవీన్ ఎర్నేని కూడా ఉన్నారు.



## జిల్లాలో 2,53,336 మందికి రూ.107.75 కోట్లు విడుదల

### ఎన్.టి.ఆర్. భరోసా పెన్షన్లు పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్ శ్రీమతి విజయ క్రిష్ణన్





**అనకాపల్లి, సిటిజన్ టైమ్స్, ఏప్రిల్ 1:**

ప్రతి లబ్ధిదారునికి ఎన్.టి.ఆర్. భరోసా పెన్షన్లు సక్రమంగా అందేలా పంపిణీ పూర్తిచేయాలని అధికారులను జిల్లా కలెక్టరు విజయ క్రిష్ణన్ ఆదేశించారు. బుధవారం ఉదయం అనకాపల్లి మండలం, 84వ వార్డ్, పెరుగు బజారులో పించన్ల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పించన్లు అందించారు. పెన్షన్లు పంపిణీ విధానంపై ఆరా తీసి సక్రమంగా సకాలంలో అందుతున్నది, లేనిది లబ్ధిదారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో జరుగుతున్న పెన్షన్లు పంపిణీ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో మొత్తం 2,53,336 మంది లబ్ధిదారులకు రూ.107,75,70,500 పంపిణీ చేయడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు. అనకాపల్లి జోన్‌తో పాటు రెండు మున్సిపాలిటీలు మరియు 24 గ్రామీణ మండలాల్లో ఉదయం 5 గంటల నుంచే లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ ప్రారంభించినట్లు తెలిపారు. శతశాతం పెన్షన్లు పంపిణీ పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఎ ప్రోజెక్టు డైరెక్టరు కె.శచీదేవి, జీవీఎంసీ కమిషనర్ చక్రవర్తి, 84 వ వార్డు మాజీ కార్పొరేటర్ నీలంశెట్టి చిన్న తల్లి తదితరులు పాల్గొన్నారు.

## అమరావతితోనే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి బాటలు


### రాష్ట్రానికి ప్రపంచ స్థాయి రాజధాని అవసరం ఉంది -ప్రతి తెలుగువాడి గుండె చప్పుడు అమరావతి

### జగన్ ఇక మూడు ముక్కలాట ఆడలేరు -లోక్‌సభలో అమరావతి బిల్లుకు ఆమోదం

### శాశ్వత రాజధానిగా అమరావతికి చట్టబద్ధత

### బిల్లుపై పార్లమెంట్‌లో ఉద్వేగభరితంగా ప్రసంగించిన

### రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు సి.ఎం రమేష్



**అనకాపల్లి, సిటిజన్ టైమ్స్, ఏప్రిల్ 01**

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందిన సందర్భంగా రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు సి.ఎం రమేష్ కీలక వ్యాఖ్యలు చేశారు. 2014 నాటి ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టానికి సవరణ చేసి, రాష్ట్ర నూతన రాజధానిగా "అమరావతి" పేరును అధికారికంగా చేర్చనున్న ఈ బిల్లు రాష్ట్ర భవిష్యత్తుకు కీలక మలుపు అని ఆయన పేర్కొన్నారు. లోక్‌సభలో జరిగిన చర్చలో మాట్లాడుతూ రాష్ట్రానికి సుస్థిర అభివృద్ధి సాధ్యమయ్యేది ప్రపంచ స్థాయి రాజధానిగా అమరావతిని అభివృద్ధి చేయడం ద్వారానే అని స్పష్టం చేశారు. విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌కు హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, కొచ్చి వంటి ఆర్థిక కేంద్రాలు లేకపోవడం అభివృద్ధికి అడ్డంకిగా మారిందని తెలిపారు.ప్రతి తెలుగువాడి గుండె చప్పుడు అమరావతేనని, ప్రజా రాజధానిగా అది చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుందని ఆయన అన్నారు.రాజధాని అనేది కేవలం భవనాల సమాహారం కాదని, అది ఆంధ్రుల గౌరవానికి ప్రతీక అని స్పష్టం చేశారు.అమరావతికి చట్టబద్ధత కల్పించడంలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కీలక పాత్ర పోషించారని తెలిపారు.ఈ బిల్లు అమరావతిని శాశ్వత రాజధానిగా స్థిరపరుస్తుందని, ఇకపై ఎవరూ దాన్ని మార్చలేరని స్పష్టం చేశారు. పులివెందుల ఎమ్మెల్యే వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇకపై అమరావతి విషయంలో మూడు ముక్కలాట ఆడలేరని, ఊసరవెల్లి రాజకీయాలు ఇక పనిచేయవని తీవ్రంగా విమర్శించారు.ఈ బిల్లు ద్వారా ఐదు కోట్ల మంది ప్రజల ఆకాంక్ష నెరవేరిందని పేర్కొన్నారు.గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం రాజధాని అంశంపై నాటకాలు ఆడిందని, రాష్ట్రాన్ని వెనక్కి నెట్టిందని విమర్శించారు.అమరావతి రైతులు న్యాయబద్ధంగా నిరసన తెలుపుతున్న సమయంలో మహిళలపై అమానుషంగా ప్రవర్తించారని ఆవేదన వ్యక్తం చేశారు.డబుల్ ఇంజన్ సర్కారుపై నమ్మకంతో కేవలం రెండు నెలల్లో 33 వేల ఎకరాల భూములు ఇచ్చిన అమరావతి రైతుల త్యాగాన్ని ఆయన కొనియాడారు.అమరావతిని నాశనం చేయాలని వైసీపీ ఎన్నో కుట్రలు చేసిందని ఆరోపించారు. అమరావతికి మద్దతివ్వని వారు చరిత్రలో ద్రోహులుగా మిగిలిపోతారని హెచ్చరించారు.డబుల్ ఇంజన్ సర్కార్ ద్వారా అమరావతి అభివృద్ధి చెందితే పెట్టుబడులు పెరిగి ఉపాధి అవకాశాలు విస్తరిస్తాయని, రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుకు సాగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

## వీధి ఆహార విక్రయదారులు ప్రజలకు పరిశుభ్రమైన ఆహారాన్ని అందించండి

### -జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్






**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 1**

నగరంలో వీధి ఆహార విక్రయదారులు ప్రజలకు పరిశుభ్రమైన ఆహారాన్ని అందించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. బుధవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఈట్ రైట్ వైజాగ్ కార్యక్రమంలో భాగంగా వీధి ఆహార విక్రయ దారులతో వీధి ఆహార పరిశుభ్రత, నాణ్యత పై అవగాహన , శిక్షణ కార్యక్రమాన్ని జీవీఎంసీ అదనపు కమిషనర్ పి.నల్లనయ్య, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈ ఎన్ వి నరేష్ కుమార్, హోటలియర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పవన్ కార్తీక్, చక్రవర్తి అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ ,ఫుడ్ సేఫ్టీ, డాక్టర్ షీలా ఫౌండర్ అండ్ సీఈవో, సెర్టిగోలతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ వీధి ఆహార విక్రయదారులు ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని పరిశుభ్రతతో పాటు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. ప్రజలకు అందించే ఆహారం నాణ్యత పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలని ముఖ్యంగా తాగునీరు, ఆహారపు దినుసులు, పరిశుభ్రమైన వంటనూనె వినియోగం, కాలుష్యం, పరిసరాల పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలన్నారు. కాలువల పక్కన విక్రయించే ఆహార పదార్థాల విషయంలో జాగ్రత్తలు పాటించాలని, ముఖ్యంగా నాణ్యతలేని ఆయిల్, అధికంగా ఫుడ్ కలర్ వాడడం వలన క్యాన్సర్ వ్యాధులు సంభవించే అవకాశాలు అధికంగా ఉన్నాయని, ఇది ప్రజల ఆరోగ్యం పై ప్రభావం చూపుతాయని కమిషనర్ తెలిపారు. వినియోగించిన ఆహార వ్యర్థాలు డస్ట్ బిన్ లో వేసేలా మీరే ప్రజలకు తెలియజేయాలన్నారు. ప్రతి జోన్ లో అధికారులు, ఆహార విక్రయదారులు తో సంయుక్త భాగస్వామ్యంతో ఫుడ్ కమిటీలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రతి జోన్ లో ఉన్న వీధి ఆహార విక్రయ దారులకు ఆహార నాణ్యత, పరిసరాల పరిశుభ్రత పై ఈ కమిటీలు అవగాహన మరియు శిక్షణ కల్పిస్తాయని కమిషనర్ తెలిపారు.

## రోడ్డు విస్తరణ పనులు పరిశీలించిన కమిషనర్, గాజువాక శాసనసభ్యులు

**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఏప్రిల్ 1**

గాజువాక జోన్ లో కణితి రోడ్ లో వంటిల్లు జంక్షన్ నుండి జగ్గు జంక్షన్ వరకు రోడ్డు విస్తరణ పనులు త్వరితగతిన ప్రారంభించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన గాజువాక జోన్ కణితి రోడ్ లోవంటిల్లు జంక్షన్ నుండి జగ్గు జంక్షన్ వరకు ప్రతిపాదించిన 1.3 కిలోమీటర్ల రోడ్డు విస్తరణ పనులకు గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా గాజువాక శాసనసభ్యులు కణితి వంటిల్లు నుండి జగ్గు జంక్షన్ వరకు ఉన్న రోడ్డు నిత్యం రద్దీతో ఉన్నందున ప్రజలు, వాహనదారులు చాలా ఇబ్బందులు పడుతున్నారని రోడ్డు విస్తరణ పనులు వెంటనే ప్రారంభించాలని కమిషనర్ కు సూచించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ కణితి వంటిల్లు నుండి జగ్గు జంక్షన్ వరకు దాదాపు 1.3 కిలోమీటర్ల రోడ్డు విస్తరణకు ఇప్పటికే టెండర్ లు పూర్తయ్యాయని, పనులు వెంటనే ప్రారంభించడం జరుగుతుందని శాసనసభ్యులకు తెలిపారు. రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నప్పుడు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పనులు ప్రారంభించాలని ఇంజనీర్లకు, టౌన్ ప్లానింగ్ అధికారులకు కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ బి ఆర్ ఎస్ శేషాద్రి, డిసిపి మధుసూదన రావు, ఏసిపి వెంకట్రావు పర్యవేక్షక ఇంజనీరు రాయలు బాబు తదితరులు పాల్గొన్నారు.





## తల్లిదండ్రులకు ఉపాధ్యాయులపై గౌరవం పెరగాలి

**-ప్రముఖ సమాజ సేవకులు సూరపురెడ్డి సురేష్**

**ఉప్పలగుప్తం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్1**



మండలం లోని, భీమనపల్లి పద్మజా స్కూల్ యానివర్సిడే సందర్భంగా ప్రముఖ సమాజ సేవకులు సూరపురెడ్డి సురేష్ జిల్లా వ్యాప్తంగా చేస్తున్న సేవలను గుర్తించిన స్కూల్ యాజమాన్యం, నాయకులు, అధికారులు, తల్లిదండ్రుల సమక్షంలో సన్మానం చేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ తల్లిదండ్రుల తర్వాత విద్యార్థిని విద్యార్థులు భవిష్యత్తు తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే అని తెలిపారు. కారణం లేకుండా ఏ ఉపాధ్యాయుడు కోప్పడడం, దండించడం చేయరని ,ఈ మధ్యకాలంలో విద్యార్థులు టీచర్లపై తిరగబడటం దానికి తల్లిదండ్రులు ప్రోత్సహించడం హేయమని అన్నారు! విద్యార్థులు క్రమశిక్షణతో ఉంటేనే సంఘం బలపడి తద్వారా దేశం బలపడుతుందని చెప్పారు. విద్యార్థులను క్రమశిక్షణతో తయారు చేయగలిగే శక్తి ఒక ఉపాధ్యాయులకే ఉందని అటువంటి వ్యక్తులకు ఎంతో గౌరవం ఇచ్చి ముందుకు నడిపించాలని తల్లిదండ్రులకు సూచన ఇచ్చారు. సేవలను గుర్తించి ఈ గౌరవం ఇచ్చిన పాఠశాల యజమాన్యానికి, స్టాఫ్ కి సురేష్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## అంకం వారి వీధిలో నూతన పింఛన్ పంపిణీ



**రామచంద్రపురం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 1**

బుధవారం రామచంద్రపురం పట్టణ 3వ వార్డు అంకం వారి వీధిలో కార్మిక శాఖ మంత్రి సుభాష్ ,పెద్దలు శ్రీవాసంశెట్టిసత్యం, సూచనలతో,3వవార్డు అంకంవారివీధిలో, సచివాలయం సెక్రటరీలు పర్యవేక్షణలో, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, అల్లం శ్రీనివాస్ తో, కలిసి ఒక కొత్త పెన్షన్ తో పాటు,ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు లబ్ధిదారులకు అందజేయడం జరిగిందని ప్రకటనలో తెలిపారు.

## హైదరాబాద్ బిర్యానీలో గుట్కా ప్యాకెట్.. మియాపూర్ కిన్నెర గ్రాండ్ హోటల్ నిర్వాకం






**హైదరాబాద్, శేరిలింగంపల్లి, సిటీజన్ టైమ్స్, ఏప్రిల్ 1**

భాగ్యనగరంలో తిండి ప్రియులకు షాకిచ్చే సంఘటనలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. తాజాగా మియాపూర్‌లోని 'కిన్నెర గ్రాండ్' హోటల్‌లో వడ్డించిన బిర్యానీలో గుట్కా ప్యాకెట్ ప్రత్యక్షమవ్వడం కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే.. మియాపూర్ పరిధిలోని కిన్నెర గ్రాండ్ హోటల్‌కు వెళ్లిన ఒక కస్టమర్ బిర్యానీ ఆర్డర్ చేశారు. ఎంతో ఇష్టంగా బిర్యానీ తింటున్న క్రమంలో అతడికి ఒక వింత అనుభవం ఎదురైంది. బిర్యానీ ముద్దతో పాటే ఏదో ప్లాస్టిక్ లాంటి పదార్థం నోట్లోకి వెళ్లడంతో వెంటనే అప్రమత్తమయ్యాడు. తీరా చూస్తే అది ఒక విప్పిన గుట్కా ప్యాకెట్ అని తేలింది. అంతేకాకుండా, ప్లేట్‌లో వెతకగా మరో సీలు వేసి ఉన్న గుట్కా ప్యాకెట్ కూడా కనిపించడంతో సదరు కస్టమర్ ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. తెలియకుండానే అప్పటికే కొంత గుట్కాను బిర్యానీతో కలిపి తినేసినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయంపై బాధితుడు వెంటనే హోటల్ యాజమాన్యాన్ని నిలదీశాడు. అయితే, హోటల్ నిర్వాహకులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించినట్లు సమాచారం జరిగిన తప్పును ఒప్పుకోకుండా, పొంతన లేని సమాధానాలు చెబుతూ విషయాన్ని పక్కదారి పట్టించే ప్రయత్నం చేశారని బాధితుడు ఆరోపిస్తున్నాడు. హైదరాబాద్‌లో వరుసగా వెలుగు చూస్తున్న ఇలాంటి ఘటనలు సామాన్య ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. ఆహార భద్రతా ప్రమాణాలు పాటించకుండా, కస్టమర్ల ప్రాణాలతో చెలగాటమాడుతున్న హోటళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# నగరంలో మురికివాడ ప్రాంతాలను అభివృద్ధి పరుస్తాం

**వెస్ట్ జోన్లో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను అందించిన పశ్చిమ ఎమ్మెల్యే పి జి వి ఆర్ నాయుడు, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్.**

**వెస్ట్ జోన్లో ఆశవాని పాలెం, దుర్గా నగర్ ప్రాంతంలో మురికివాడ ప్రాంత అభివృద్ధికి ప్రణాళికలు చేపడతాం.**

***-జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్***





**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఏప్రిల్ 1**

విశాఖపట్నం పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 57వ వార్డు ఆశివానిపాలెం, దుర్గానగర్, సాకేత్ పురం ప్రాంతాల్లో "పేదల సేవలో" కార్యక్రమంలో బుధవారం పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు పీ.జీ.వీ.ఆర్ నాయుడు (గణబాబు), జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ లు సంయుక్తంగా పాల్గొని లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి ఎన్టీఆర్ భరోసా పింఛన్లను అందించారు. ఈ సందర్భంగా పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు గణబాబు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రతి పేదవాడికి ప్రభుత్వ పథకాల ఫలాలు అందాలనే లక్ష్యంతో పనిచేయడం జరుగుతుందని, ఎన్టీఆర్ ఆర్థిక భరోసా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి అందించడం జరుగుతుందని తెలిపారు. అలాగే కూటమి ప్రభుత్వం సంక్షేమముతో పాటు మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఆశవానిపాలెం దుర్గా పురంలో ఉన్న మురికివాడలోని పేద, మధ్యతరగతి ప్రజలకు సంక్షేమ తో పాటు మౌలిక వసతులు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. ఇక్కడ ప్రజలు సరైన ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్నారని వారికి గృహ సముదాయం నిర్మించేలా చర్యలు చేపట్టాలని శాసనసభ్యులు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం జివిఎంసి కమిషనర్ మాట్లాడుతూ పింఛన్ల పంపిణీ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా, లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా నేరుగా వారి ఇంటి వద్దకే చేర్చేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. మురికివాడల అభివృద్ధి దిశగా రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందని ఆశవాణి పాలెం దుర్గాపురం మురికివాడ ప్రాంతం అభివృద్ధికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఇక్కడ నివసించే ప్రజలు సరైన ఇల్లు లేని కారణంగా చాలా ఇబ్బందులకు గురవుతున్నారని, వారికి అవసరమయ్యే కనీసం రెండు పడక గదులు, వంటగది హాలు మరుగుదొడ్లు ఉండే విధంగా బహుళ అంతస్తుల ఇల్లు నిర్మించేందుకు చర్యలు చేపడతామని, నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు ఇక్కడ ప్రజలకు అవసరమయ్యే అన్ని మౌలిక వసతులు కల్పిస్తామని కమిషనర్ తెలిపారు. ఈ పంపిణీ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ బి .హేమావతి, గవర కార్పొరేషన్ డైరెక్టర్ పెంటకోట అజయ్ బాబు, ఏపీడీ,సచివాలయ సిబ్బంది , వార్డు నాయకులు పాల్గొన్నారు.

## ఎన్ ఎస్ టి ఎల్ వద్ద గిరి ప్రదక్షిణ రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయండి

**-జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్**





**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఏప్రిల్ 1**

జీవీఎంసీ వెస్ట్ జోన్ పరిధిలోగల ఎన్ ఎస్ టి ఎల్ నుండి గోపాలపట్నం కుమారి కళ్యాణ్ మండపం జంక్షన్ (గిరి ప్రదర్శన రోడ్డు) వరకు చేపట్టిన రోడ్డు విస్తరణ పనులను వేగవంతం చేయాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన పశ్చిమ జోన్ 91, 92 వార్డుల పరిధిలో ఉన్న లక్ష్మీ నగర్, ఇందిరానగర్ తదితర ప్రాంతాలలో 80 అడుగుల మాస్టర్ ప్లాన్ రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ గోపాలపట్నం కుమారి కళ్యాణ మండపం నుండి ఎన్ఎస్టిఎల్ వరకు 80 అడుగుల మాస్టర్ ప్లాన్ విస్తరణ రోడ్డులో భాగంగా మొదట దశలో చేపట్టిన 40 అడుగుల రోడ్డు విస్తరణ పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని పలు సూచనలు చేశారు. రోడ్డు విస్తరణలో పలువురు నివాసితులు రోడ్డు విస్తరణ పై పి జి ఆర్ ఎస్ లో పలు సమస్యలపై అర్జీలు పెట్టుకోగా రోడ్డు విస్తరణ పనులను పరిశీలించడం జరిగిందన్నారు. ఆయా స్థానికలతో కమిషనర్ ప్రస్తావించి వారి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. జరుగుచున్న 40 అడుగుల రోడ్డు విస్తరణ పనులు పరిశీలంతో పాటు రోడ్డు మ్యాప్ ను కూడా కమిషనర్ పరిశీలించి టౌన్ ప్లానింగ్ అధికారులకు, ఇంజనీర్లకు పలు సూచనలు చేశారు. అనంతరం ఎన్ఏడి ఎన్ ఎస్ టి ఎల్ రోడ్డులో పారిశుద్ధ్య పనులను పరిశీలించి, పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి అలసత్వం వహించరాదని, పరిసరాలను ఎప్పటికప్పుడే పరిశుభ్రపరచాలని, నిర్ణీత సమయానికే పారిశుద్ధ్య కార్మికులు, క్లాప్ వాహనాలు విధుల్లో ఉండేలా చర్యలు చేపట్టాలని ప్రజా ఆరోగ్యపు అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ బి. హేమావతి, జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈ ఎన్ వి నరేష్ కుమార్, పర్యవేక్షక ఇంజనీరు ప్రవీణ్ కుమార్, డీసీపీ రామ్మోహన్, ఏసిపి రామలింగేశ్వర రెడ్డి, కార్యనిర్వాహక ఇంజనీరు తారా ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా అభివృద్ధిపై కలెక్టరేట్లో సమీక్ష సమావేశం నిర్వహణ




**ధర్మవరం:( సిటిజన్ టైమ్స్ ): ఏప్రియల్:01**

శ్రీ సత్యసాయి జిల్లా సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ స్పష్టం చేశారు. బుధవారం పుట్టపర్తి జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా సమీక్షా సమావేశంలో మంత్రి సవిత తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు పల్లె సింధూర రెడ్డి, ఎంఎస్ రాజు, కందికుంట వెంకటప్రసాద్, జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎస్పీ సతీష్ కుమార్, జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్, డీసీఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేష్, ఇరిగేషన్ డైరెక్టర్ పత్తి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. సమావేశం ప్రారంభంలో జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధకం, విద్య, వైద్యం, రహదారుల నిర్మాణం, హెచ్ఎన్ఎస్ఎస్ ప్రాజెక్టు వంటి కీలక అంశాలపై సమగ్ర నివేదికను మంత్రులకు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ... జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులను వేగవంతం చేసి రైతులకు తగినంత నీరు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా హెచ్ఎన్ఎస్ఎస్ ప్రాజెక్టు పనులను వేగంగా పూర్తి చేసి ప్రతి చెరువును నీటితో నింపేలా ప్రణాళికలు అమలు చేయాలని ఆదేశించారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను ప్రాధాన్యతగా పూర్తి చేయాలని, మైక్రో ఇరిగేషన్ కోసం కేటాయించిన ?50 కోట్ల నిధులను పూర్తిస్థాయిలో వినియోగించాలని సూచించారు. జిల్లెడుబండ భూసేకరణను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి, హెచ్ఎన్ఎస్ఎస్ కాలువను పీఏబీఆర్ రైట్ కెనాల్‌తో అనుసంధానం చేయాలని పేర్కొన్నారు. ధర్మవరం నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, చెరువులను 100 శాతం నింపేందుకు చర్యలు తీసుకోవాలని, ఆర్ఆర్ఆర్ పథకం కింద ?6.10 కోట్లతో మరమ్మత్తులు చేపట్టాలని సూచించారు. పట్టణ త్రాగునీటి సమస్య పరిష్కారానికి ?136 కోట్ల అంచనాతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. అలాగే ధర్మవరం పట్టణ అభివృద్ధి కోసం సరికొత్త మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నామని, అహుద ఆధ్వర్యంలో రివర్‌ఫ్రంట్, పార్కుల అభివృద్ధికి వెంటనే డీపీఆర్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పట్టు పరిశ్రమ అభివృద్ధికి షెడ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని తెలిపారు. జిల్లాలోని ప్రతి నియోజకవర్గానికి సంబంధించిన సమస్యలను ముఖ్యమంత్రివర్యుల దృష్టికి, అలాగే కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామని మంత్రి సత్య కుమార్ యాదవ్ స్పష్టం చేశారు. జిల్లాను అన్ని రంగాల్లో ఆదర్శంగా నిలబెట్టడమే లక్ష్యంగా ప్రభుత్వం మరియు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా మంత్రి పిలుపునిచ్చారు.

## పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి వాసంశెట్టి సుభాష్



**పామర్రు సిటిజన్ టైమ్స్ మార్చి ఏప్రిల్ 1**

మండలం లోని జోజ్జవరం గ్రామంలో నిర్వహించిన పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా, గౌడ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు వంటి అర్హులైన ప్రతి ఒక్కరికీ సమయానికి పెన్షన్లు అందేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. సంక్షేమ పథకాల అమలు ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని పేర్కొన్నారు. ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా మాట్లాడుతూ, ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు గ్రామస్థాయిలో ప్రజలకు నేరుగా చేరుతున్నాయని అన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు పెన్షన్లు అందజేసి, వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి హామీ ఇచ్చారు.

## గ్రామాల అభివృద్ధికి చేసిన కృషి ప్రశంసనీయం

**పి గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ**




**అంబాజీపేట సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 1**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో నియోజకవర్గ శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,ఈ కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు.ఇప్పటివరకు వివిధ శాఖలకు చెందిన అధికారులు మాట్లాడి,శాఖల అభివృద్ధి కోసం తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారని పేర్కొన్నారు. రేపటితో పదవీకాలం ముగించుకోబోతున్న అంబాజీపేట మండల సర్పంచులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. వారు కష్టపడి చేసిన సేవలకు తగిన గుర్తింపు తప్పకుండా లభిస్తుందని అన్నారు. సేవలలో తృప్తి,అసంతృప్తి ఉండటం సహజమని, అయినప్పటికీ అందరూ గ్రామాల అభివృద్ధికి చేసిన కృషి ప్రశంసనీయం అని తెలిపారు. కార్యక్రమం అనంతరం మండల ప్రజా పరిషత్ ఆధ్వర్యంలో సర్పంచులను ఘనంగా సన్మానించారు. శాసనసభ్యులను కూడా సత్కరించారు. ఈ సందర్భంగా గ్రామ "స్వచ్ఛ రథం"ను ఎమ్మెల్యే ప్రారంభించారు. గ్రామాలలో పరిశుభ్రత, పారిశుధ్యంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ, ఎమ్మార్వో, ఎండిఓ,వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ సిలిండర్ల దొంగ అరెస్ట్...



**శేరిలింగంపల్లి,మాదాపూర్, సిటీజన్ టైమ్స్, ఏప్రిల్ 01**

మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న నేరస్థుడిని పోలీసులు అరెస్ట్ చేసి రూ.1.5 లక్షల విలువైన 31 కమర్షియల్ గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. మాదాపూర్ సీఐ కృష్ణమోహన్ తెలిపిన వివరాల ప్రకారం సూర్యాపేటకు చెందిన సందీప్‌కుమార్ రెడ్డి (24), బాచుపల్లి సాయినగర్ నివాసి, ఫుడ్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తూ ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడి రాత్రి వేళల్లో హోటళ్లు, హాస్టళ్లను లక్ష్యంగా చేసుకొని గ్యాస్ సిలిండర్లు, ఇతర విలువైన వస్తువులను దొంగిలించి వాటిని విక్రయించి వచ్చిన డబ్బును బెట్టింగ్‌లో ఖర్చు చేస్తున్నాడు. విచారణలో భాగంగా సీసీటీవీ ఫుటేజ్ సేకరించి ఎంఎస్‌సీడీ ఫేస్ రికగ్నిషన్ సాయంతో కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన పాత కేసుతో పోల్చి నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. మాదాపూర్, బాచుపల్లి, ఎస్.ఆర్.నగర్, కేపీహెచ్‌బీ, కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లలో నమోదైన పలు కేసుల్లో అతడి ప్రమేయం ఉన్నట్లు తేలింది. ఈ సందర్భంగా పోలీసులు ప్రజలు తమ ఇళ్లను భద్రంగా తాళాలు వేసుకోవాలని, హోటల్, హాస్టల్ నిర్వాహకులు సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కేసుల పరిష్కారంలో కృషి చేసిన మాదాపూర్ క్రైమ్ టీంను ఉన్నతాధికారులు అభినందించారు.

# కాకినాడ జిల్లా అభివృద్ధి కి కృషి

## నూతన కలెక్టర్ హరేందర్ ప్రసాద్





**కాకినాడ, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 1**

ప్రజలు, ప్రజాప్రతినిధులు అందరి సహాకారం, సమిష్టి భాగస్వామ్యంతో కాకినాడ జిల్లాను అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో నడిపిస్తామని పదవీ బాధ్యతలు చేపట్టిన నూతన జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. బుధవారం ఉదయం కాకినాడ జిల్లా నూతన కలెక్టరుగా ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తమ కార్యాలయ ఛాంబరులో పదవీ బాధ్యతలు స్వీకరించారు. తొలుత ఆయన విశాఖపట్టనం నుండి అన్నవరం చేరుకుని శ్రీ రమా సత్యన్నారాయణ స్వామి వారిని దర్శించి, అర్చన, ఆశీర్వాద కార్యక్రమాలలో పాల్గొన్నారు. తదుపరి ఉదయం 9-30 గంటలకు కాకినాడ జిల్లా కలెక్టరు కార్యాలయాని చేరుకోగా ఆయనకు జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, అసిస్టెంట్ కలెక్టర్ మనీషా, డిఆర్ఓ డి.తిప్పేనాయక్, జిల్లా అధికారులు, వేదపండితుల పూర్ణకుంభం, మేళతాళాలతో స్వాగతం పలికారు. కలెక్టర్ ఛాంబరులో ఆయన పదవీ బాధ్యలు చేపడుతూ సంతకం చేసి, పండితుల వేదస్వస్తి, ఆశీర్వచనాలను స్వీకరించారు. ఈ సందర్భంగా తనను కలిసిన మీడియా ప్రతినిధులతో నూతన జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ ఘన చరిత్ర, ఎన్నో విశిష్టతలు కలిగిన కాకినాడ జిల్లాలో పనిచేయడం తనకు లభించిన అపూర్వ అవకాశమని పేర్కొంటూ, ఈ అవకాశం కల్పించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి గారికి ధన్యవాదాలు తెలియజేశారు. విశాఖపట్నంలో కలెక్టర్ గాను, జివిఎంసి కమీషనర్ గాను పనిచేసిన అనుభవంతో కాకినాడ జిల్లాలో గ్రామీణ, పట్టన ప్రాంతాల సమగ్ర అబివృద్ధికి కృషి చేస్తానని తెలియజేశారు. ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ఫలాలు అందరికీ అందించేందుకు, అధికారుల సమన్వయం, ప్రజాప్రతినిధుల సహకారంతో జిల్లాను ముందుకు నడిపిస్తామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి ఆదేశాల కనుగుణంగా పేదరిక నిర్మూలన, స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాల సాధన ప్రాధాన్యతలుగా పనిచేస్తామని, ముందు పనిచేసిన కలెక్టర్లు చేపట్టిన వినూత్న కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. కాకినాడ వ్యవసాయ ప్రధాన జిల్లా అయినందున, రైతులు తక్కువ ఖర్చుతో అధిక ఉత్పాదనలు, ఆదాయం పొందేలా కార్యక్రమాలు చేపడతామన్నారు. జిల్లా భౌగోళిక విశిష్టతలను గరిష్ట స్థాయిలో సద్వినియోగంలోకి తేవడం ద్వారా జిల్లా ఆర్థిక ప్రగతికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ డిసి రమేష్ బాబు, ఆర్డిఓలు ఎస్.మల్లిబాబు, ఎన్.శ్రీధర్, సిపిఓ పి.త్రినాథ్, డ్వామా పిడి పి.వెంకట లక్ష్మి, సమాచారశాఖ డిడి పి.తిమ్మప్ప, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సెక్షన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పింఛన్ వచ్చింది - పండగ తెచ్చింది

### దెందులూరు నియోజకవర్గంలో నేడు


### రూ. 15కోట్ల62లక్షలు పంపిణీ



**దెందులూరు (సిటిజన్ టైమ్స్) ఏప్రియల్ 01**

దెందులూరు నియోజకవర్గంలో పండగ వాతావరణం లో బుధవారం తెల్లవారుఝాము నుంచే ప్రారంభమైన ఎన్టీఆర్ భరోసా ఫించన్లు పంపిణీ కార్యక్రమం - పెదవేగి మండలంలోని పలు గ్రామాల్లో జరిగిన ఫించన్లు పంపిణీ కార్యక్రమంలో స్వయంగా పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేసిన దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్. నేటి దెందులూరు నియోజకవర్గం లోని 35,127 మంది పింఛన్ లబ్ధిదారులకు రూ.15కోట్ల 62లక్షల 48వేల500 రూపాయలు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల రూపేన అందిస్తున్న కూటమి ప్రభుత్వం. దెందులూరు నియోజకవర్గ పరిధిలోని గ్రామ గ్రామాన కొనసాగుతున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ - పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక ప్రజాప్రతినిధులు కూటమి నాయకులు సంబంధిత అధికారులు సిబ్బంది.

## గోడి లంక పంచాయతీ పాలకవర్గానికి ఘన సన్మానం



**అల్లవరం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 1**

మండలంలోని గోడిలంక సర్పంచ్ రుద్రరాజు పవిత్ర లక్ష్మీపతి ని వార్డ్ మెంబెర్స్ ను ఘనంగా సన్మానించిన గ్రామస్థులు సచివాలయం సిబ్బంది. ఏప్రియల్ 2న పంచాయతీ పాలకవర్గం గడువు ముగుస్తునందున ఈ రోజు గోడిలంక గ్రామ పంచాయితీ కార్యాలయం ఏర్పాటు చేసిన సమావేశం లో గత 5 సంవత్సరాలు గా గ్రామం లో జరిగిన అభివృద్ధి పనుల గురించి పలువురు వక్తలు మాట్లాడారు. ఈ సమావేశం లో వైస్సార్సీపీ నాయకులు నాతి శ్రీనివాసరావు మాట్లాడుతూ గతంలో కంటే గ్రామం లో ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించిన ఘనత శ్రీమతి రుద్రరాజు పవిత్ర లక్ష్మీపతి రాజు కి దక్కిందని, గ్రామంలో లో సీసీ రోడ్లు, వాటర్ ట్యాంక్, స్కూల్స్, కమ్యూనిటీ హాల్ వంటి అభివృద్ధి పనులు అన్నీ గత ప్రభుత్వ సహకారం తో వేగవంతం గా జరిగాయని అన్నారు. గ్రామస్థులు మాట్లాడు తూ కుల,మత, వర్గ, పార్టీ విభేదాలు చూడకుండా పరిపాలన అందించిన మంచి వ్యక్తి ఉప సర్పంచ్ లక్ష్మీపతి రాజు అని కొనియాడారు. ఈ కార్యక్రమం లో వేగిరాజు సుబ్బరాజు,కొనుకు అమ్మాజీ,సవరపు బాపూజి,కుంచే నరేంద్ర,నాతి గంగాదేవి,రుద్రరాజు శ్రీనివాస గంగరాజు,బొంతు ప్రమీల,వాసర్ల శేషారత్నం, పంచాయతీసిబ్బంది పాల్గొన్నారు.



## అల్లూరి ఏజెన్సీ

# గిరిజనులకు తీరని కష్టాలు

### *గిరిజనులంటే అధికారులకు చిన్న చూపా..?*

**సిటిజన్ టైమ్స్ అల్లూరి జిల్లా :ఏప్రిల్ 01**

అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగుల మండలం గడుతూరు పంచాయతీ పరిధిలోని బొడ్డు మామిడి, బొందుల పనుకు, జోడు మామిడి, నిట్ట మామిడి గ్రామాల గిరిజన ప్రజలు ప్రాథమిక సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నాలుగు గ్రామాలకు రహదారి సౌకర్యం లేకపోవడంతో ప్రజలు ప్రతి వారం సుమారు 12 కిలోమీటర్లు కాలినడకన వాస్తమామిడి గ్రామం నుంచి లంబసింగి వారపు సంతకు వెళ్లి నెలవారీ సరుకులు తెచ్చుకుంటున్నారు. వర్షాకాలంలో ఈ ప్రయాణం మరింత కష్టసాధ్యంగా మారుతుందని స్థానికులు వాపోతున్నారు. గ్రామాల్లో తాగునీటి సౌకర్యం కూడా సరిపడా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అత్యవసర పరిస్థితుల్లో కూడా రహదారి లేకపోవడం వల్ల వైద్య సేవలు అందక గర్భిణీ స్త్రీలు ఇంట్లోనే ప్రసవం చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. దీంతో తల్లి, శిశు ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఇంట్లో పుట్టిన పిల్లలకు జనన ధృవీకరణ పత్రాలు లేకపోవడంతో ఆధార్ కార్డులు పొందడంలో సమస్యలు తలెత్తుతున్నాయి. సర్టిఫికెట్లు పొందేందుకు సచివాలయాల చుట్టూ తిరిగినా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అదేవిధంగా రహదారి లేకపోవడంతో పీఎం జన్మన్ హౌసింగ్ పథకం ఇళ్ల నిర్మాణం కూడా జరగడం లేదు. నిర్మాణ సామగ్రి గ్రామాలకు తీసుకురావడం



అసాధ్యంగా మారింది. అంగన్వాడి సేవలు కూడా సక్రమంగా అందడం లేదు. ప్రతి నెల పిల్లలకు ఇవ్వాల్సిన పాలు, గుడ్లు, పప్పు కోసం బర్సింగి గ్రామానికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో వాస్తమామిడి నుంచి నిట్టమామిడి, బొందుల పనుకు, జోడు మామిడి, బొడ్డు మామిడి గ్రామాల వరకు రహదారి నిర్మాణం చేపట్టాలని, శాశ్వత తాగునీటి సౌకర్యం కల్పించాలని, సిసి రోడ్లు, మినీ అంగన్వాడి కేంద్రాలు ఏర్పాటు చేయాలని, ఆరోగ్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని గిరిజన మా సమస్యలు ఎవరూ పట్టించుకోవడం లేదు. అధికారులు నిర్లక్ష్యమే చేస్తున్నారు ప్రభుత్వం వెంటనే స్పందించాలి అని గ్రామస్తులు కూటమి ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

## పింఛన్లు ఇచ్చి ప్రజాసమస్యలు తెలుసుకుందాం



**తాడేపల్లిగూడెం :( సిటిజన్ టైమ్స్ ): ఏప్రియల్ :01**

ప్రతినెలా ఒకటోతేదీన పింఛన్లు ఇవ్వటంతో పాటు, ఆ ప్రాంతంలోని ప్రజా సమస్యలను కూటమి నేతలు తెలుసుకోవాలని శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు.స్థానిక హౌసింగ్ బోర్డు గృహ సముదాయం వద్ద బుధవారం ప్రభుత్వ అధికారులు, కూటమి నాయకులతో కలిసి ఎమ్మెల్యే ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త పింఛన్లు ఇవ్వడానికి అవసరమైన చర్యలు చేపట్టామన్నారు. ప్రభుత్వ పనితీరు పట్ల పింఛనుదారులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని అన్నారు. రాజకీయ నాయకులు,అధికారులు స్వయంగా పింఛను దారుల ఇంటికి వెళ్లి,వారిని కలిసి పింఛను అందజేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారని తెలిపారు. దీనివల్ల ఆ ప్రాంతంలోని ప్రజా సమస్యలను తెలుసుకొని, పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి ఈ ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. వార్డుల వారీగా జనసేన కార్యకర్తలు కూటమి నాయకులు పింఛనుదారుల ఇంటికి వెళ్లి వారి సమస్యలను తెలుసుకోవాలని సూచించారు.కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని అన్నారు.గత వైసిపి ప్రభుత్వ అరాచక పాలనకు, కూటమి ప్రభుత్వ మంచి పరిపాలనకు మధ్య తేడాను ప్రజలకు అవగాహన కలిగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు, భారతీయ జనతా పార్టీ కన్వీనర్ ఈతకోట తాతాజీ,వర్తనపల్లి కాశి, చాపల రమేష్, దువ్వ శ్రీనివాస్,మద్దాల మణికుమార్,దేవేంద్ర, హరికృష్ణ, సంతక రమణ, నాయుడు, కందుల విజయ, ప్రశాంతి, గట్టం నాని, అడబాల మురళి, పసల కొండ, పసుమర్తి రామ లక్ష్మణ్, వాడపల్లి సుబ్బరాజు, ఎర్రిపండు సతీష్, కూటమి నాయకులు తో పాటు అధికారులు పాల్గొన్నారు.

## గాలికుంటు వ్యాధి నివారణ కార్యక్రమం



**సిటిజన్ టైమ్స్, కలికిరి,ఏప్రిల్ 1**

కలికిరి మండలం మేడికురిటి గ్రామంలో గాలి కుంటి వ్యాధి టీకాలను వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ కీర్తి ప్రారంభించారు ఈ కార్యక్రమం ఏప్రిల్ 1వ తేదీ నుండి 3 వ తేదీ వరకు గ్రామంలో జరుగుతుందని కావున గ్రామంలోని పశువుల రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు తరువాత భారత పశుధన్ యాప్ ను నవీకరణ చేసి వ్యాక్సిన్ వివరాలను నమోదు చేస్తామన్నారు ప్రతి రైతు ఇంటి దగ్గరకు వచ్చి టీకా కార్యక్రమం చేపడతామన్నారు.


## సకాలంలోనే అందించాము

**తోలుకోడు :( సిటిజన్ టైమ్స్ ): ఏప్రియల్ :01:**



ఎన్టీఆర్ జిల్లా, మైలవరం నియోజకవర్గం, మండలం, తోలుకోడు గ్రామంలో ఉన్నటువంటి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్ కోటగిరి. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సొసైటీలో ఎంతమంది రైతులు సభ్యత్వం కలిగి ఉన్నారో, ఎంతమంది రైతులు రుణాలు తీసుకున్నారు తెలిపారు. అదేవిధంగా వారందరికీ ఎలాంటి ఇబ్బంది లేకుండా సకాలం లోనే ఎరువులు అందించామని పేర్కొన్నారు. వరి, మామిడి,మొక్కజొన్న పంటలు పండిస్తున్నారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రైతులకు, రుణాలు, ఎరువులు సకాలంలో అందాయని తెలపడం జరిగింది.

## నేడు మద్యం, రెస్టారెంట్లు బంద్



**సైబరాబాద్, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 1**

హనుమాన్ జయంతి వేడుకల సందర్భంగా, శాంతిభద్రతల పరిరక్షణ కోసం గురువారం సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో మద్యం దుకాణాలను మూసివేయాలని కమిషనర్ డాక్టర్ ఎం.రమేష్ ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు వైన్ షాపులు, కల్లు దుకాణాలు, బార్లను వాటికి అనుబంధంగా ఉన్న రెస్టారెంట్లు క్లోజ్ చేయాలని పోలీసులు నోటీసులు జారీ చేశారు. స్టార్ హోటళ్లు, రిజిస్టర్డ్ క్లబ్బులకు మినహాయింపు ఉంటుందని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇక రేపు శోభాయాత్రలు జరగనున్న నేపథ్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు.

## రాపిడో డ్రైవర్ నిజాయితీ..

### దొరికిన ఫోన్ పోలీసులకు అప్పగింత.....

**శేరిలింగంపల్లి,మాదాపూర్, సిటీజన్ టైమ్స్, ఏప్రిల్ 01**

మాదాపూర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ రాపిడో డ్రైవర్ తన నిజాయితీని చాటుకున్నారు. బుధవారం ఉదయం ఐకియా సమీపంలో రహదారిపై పడి ఉన్న ఒక మొబైల్ ఫోన్‌ను గుర్తించిన రాఘవేందర్ అనే రాపిడో డ్రైవర్, వెంటనే దానిని మాదాపూర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో పోలీసులకు అందజేశారు. అనంతరం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ కుమార్ ఆ ఫోన్ యజమాని బాలమురళిని గుర్తించి, ఆయనను స్టేషన్‌కు పిలిపించి సురక్షితంగా ఫోన్‌ను అందజేశారు. బాధ్యతాయుతంగా వ్యవహరించి ఫోన్‌ను అప్పగించిన రాఘవేందర్‌ను పోలీసులు ఈ సందర్భంగా అభినందించారు.



## నిబంధనలకు విరుద్ధంగా గ్రామకంఠ భూములు రిజిస్ట్రేషన్లపై చర్యలు తీసుకోండి



**జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఏప్రిల్ 1 సిటిజన్ టైమ్స్**

పీలేరు సబ్ - రిజిస్ట్రార్ పరిధిలో గల ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి గ్రామ కంఠ భూముల రిజిస్ట్రేషన్లో జరుగుతున్న అవకతవకలపై తగు విచారణ చెపట్టి అవకతవకలకు పాల్పడుతున్న వారిపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని నేడు సి. పీ. ఐ, మాలమహానాడు ఆధ్వర్యంలో పీలేరు సబ్ రిజిస్టర్ మాధవి కి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సి.పి.ఐ.పీలేరు నియోజకవర్గ కార్యదర్శి తపాయి వెంకటేష్, మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణ్ కుమార్, లు మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లా పీలేరు పరిధిలో గల మండలాల గ్రామకంఠం (గ్రామ కంఠాలు) భూముల రిజిస్ట్రేషన్‌లో తీవ్రమైన అవకతవకలు జరుగుతున్నాయి కొంతమంది వీ.ఆర్.వో.లు నిబంధనలను అతిక్రమించి తమ చేతివాటం ప్రదర్శిస్తూ సర్వే నెంబర్లు మార్చి తప్పుడు పొజిషన్ సర్టిఫికెట్లు ఇస్తున్నారు దీంతో అధిక మొత్తంలో డబ్బులు చేతులు మారుతున్నాయి"గ్రామకంఠాలు రిజిస్ట్రేషన్ చేయొద్దు" అనే వార్త పత్రికల్ల వచ్చింది కానీ కొంతమంది మధ్యవర్తులు ప్రజలను మోసం చేసి డబ్బులు దోచుకుంటున్నారు ఈ పరిస్థితి పీలేరు సబ్ - రిజిస్టర్ కార్యాలయం ఆవరణంలోనే కనిపిస్తోంది ఈ అంశాలపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని సబ్ రిజిస్టర్ గారిని కోరారు గ్రామీణ భూముల రిజిస్ట్రేషన్‌లో అవకతవకలు ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్రంలో సాధారణం కావున వెంటనే తగు విచారణ చేపట్టి రాజ్యాంగ బద్ధమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

## జిల్లా కలెక్టర్ చే పింఛన్లు పంపిణీ



**కొత్తపేట సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 1**

సమాజంలో వెనుకబడిన వర్గాలకు, వృద్ధు లకు, వికలాంగులకు చేతివృత్తిదారులకు భరోసా కల్పించడమే ధ్యేయంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ జిల్లా వ్యాప్తంగా పంపిణీ చేయడం జరు గుతుందని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ వెల్ల డించారు. బుధవారం మండల పరిధిలోని మోడీ కుర్రు గ్రామ పరిధిలో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఒక వితంతు,3 వయో వృద్ధ పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లా డుతూఎన్టీఆర్ భరోసాతో పేదలకు సామాజిక ఆర్థిక భద్రత చేకూరుతుందన్నారు. పేద ప్రజల సామాజిక భద్రతే ప్రభుత్వ లక్ష్యమని ఎన్టీఆర్ భరోసా ద్వారా పేదల జీవన ప్రమాణాలను పెంచడంతో పాటు, పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను కూడా అమలు చేస్తుందని జిల్లా కలెక్టర్ అన్నారు. ఈ సందర్భంగా లబ్ది దారులను స్వయంగా కలిసి పెన్షన్లు అందిస్తున్న ప్రక్రియ గురించి అడిగి తెలుగుసుకున్నారు. లబ్ధిదారులను ఆత్మీయంగా పలకరిస్తూ సమస్యలు ఏవైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అవకతవకలకు తావు లేకుండా అంకితభావంతో అత్యంత పారదర్శకత జవాబు దారీతనంతో ప్రభుత్వ మార్గద ర్శకాలకు అనుగుణంగా పెన్షన్ల మొత్తాన్ని లబ్ధిదారుల ఇళ్లవద్దే అందిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అధికారుల ప్రత్యక్ష పర్యవేక్షణ లో ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా లబ్దిదారులకు పెన్షన్లు అందిస్తున్నామన్నారు.. వివిధ క్యాటగిరీల పెన్షన్లకు సంబం ధించి మొత్తాన్ని లబ్దిదారులకు అందజేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. పింఛన్ల పంపిణీలో సిబ్బంది అలసత్వం ప్రదర్శించ రాదని అవినీతికి తావు లేకుండా నగదు పంపిణీ నిర్వహించాలన్నారు. ప్రజలకు చేరువగా వారి వారి ఇళ్ల వద్దే పంపిణీ చేపట్టాలన్నారు పేదల సేవలో భాగంగా పేదల సేవయే పరమావధిగా ప్రభుత్వం తీసు కున్న ఈ నిర్ణయం లక్షలాది కుటుంబాల్లో వెలుగులు నింపు తోందన్నారు. ఈ కార్యక్ర మం కేవలం ఆర్థిక సాయం మాత్రమే కాదని ఆపదలో ఉన్న వారికి ప్రభుత్వం ఇచ్చే ఒక పెద్ద అండ అన్నారు. గతంలో కంటే పెంచిన పింఛన్ మొత్తాన్ని నేరుగా మీ చేతుల్లో పెట్టడం ద్వారా లబ్ధిదా రులకు ఆర్థిక ఇబ్బందులు తీరుతున్నయన్నారు జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఎటువంటి వివక్ష లేకుండా, అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ సక్రమంగా అందుతోందన్నారు వృద్ధాప్యంలోఎవరిపైనా ఆధా రపడ కుండా, గౌరవంగా జీవించేలా ఈ పింఛన్ వృద్ధు లకు దివ్యాంగులకు దీర్ఘకాలిక అనారోగ్యాలతో ఉన్న వారికి భరోసాగా నిలుస్తోందన్నారు పింఛన్ అనేది మీ హక్కు, దానిని అందించడం మా బాధ్యత అన్నారు ప్రతినెలా మొదటి రోజే లబ్ధిదారులందరికీ పింఛన్ అందేలా క్షేత్రస్థాయి సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నా రు. ఈ పింఛన్ మొత్తాన్ని మీరు మీ ఆరోగ్య అవసరాలకు మరియు నిత్యావసరాలకు సద్వినియోగం చేసుకోవాలని లబ్ధిదారులకు సూచిం చారు మీకు ఏవైనా సమస్యలు ఎదురైతే నేరుగా సంబంధిత అధికారులను సంప్రదించవ చ్చునన్నారు ప్రభుత్వం మరియు జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ మీ సంక్షేమం కోసమే పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ పథక సంచా లకులు డి రాంబాబు మండల తాసిల్దారు రాంబాబు డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు సచి వాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తరాంధ్ర ఉద్దండులమని చెప్పుకునే బొత్స, ధర్మానలకు అవగాహనే లేదు

## జగన్ రెడ్డి కంటే వాళ్లే పెద్ద పిచ్చోళ్లు -రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

### వైకాపా పార్టీని ప్రజలు పూర్తిగా మరిచిపోయారు

### పార్టీ ఉందని గుర్తు చేసుకునేందుకే 3 జిల్లాల నాయకులు పోర్టు చూసేందుకు వచ్చారు

### జగన్ జంగిల్‌రాజ్ పాలన వల్లే వైసీపీని ప్రజలు 11 సీట్లకు పరిమితం చేశారు

### మూలపేట పోర్టు చూసేందుకు 40 మందికి అనుమతులు ఇచ్చాం.. ఎందుకు వెళ్లలేదో చెప్పాలి

### రాష్ట్రంలో 5 కోట్ల మంది ప్రజల కల నేడు నెరవేరతుంది



**టెక్కలి:( సిటిజన్ టైమ్స్) ఏప్రియల్ 01**

జగన్ రెడ్డి కంటే ఉత్తరాంధ్ర ఉద్దండులమని చెప్పుకునే బొత్స, ధర్మానలే పెద్ద పిచ్చోళ్లు అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో విమర్శించారు. శ్రీకాకుళం జిల్లా, కోటబొమ్మాళిలో పింఛన్ల పంపిణీ అనంతరం మాట్లాడిన ఆయన, ధర్మాన వంటి సీనియర్ నాయకులమని చెప్పుకోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. రాష్ట్రం విడిపోతే తప్ప రాజధానులు మారవని కూడా తెలియదా అని ప్రశ్నించారు. మూలపేట పోర్టు చూసేందుకు మూడు జిల్లాల నాయకులు వచ్చారని, పోర్టును సందర్శించేందుకు 40 మందికి అనుమతులు ఇచ్చినా ఎందుకు వెళ్లలేదో చెప్పాలని మంత్రి ప్రశ్నించారు. కళ్లకు కనిపించకపోతే భూతద్దాలు కూడా పంపిణీ చేస్తామని ఎద్దేవా చేశారు. జగన్ కారణంగా దేశంలో రాజధాని లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ మిగిలిపోయిందని అచ్చెన్నాయుడు విమర్శించారు. మూడు రాజధానుల పేరుతో జగన్ నాటకం ఆడారని, ప్రజలు ఆ విషయం గ్రహించి వైసీపీని ఓడించారని అన్నారు. అయినా జగన్‌కు సిగ్గు రాలేదని మండిపడ్డారు. జగన్ జంగిల్‌రాజ్ పాలన వల్లే వైసీపీని ప్రజలు 11 సీట్లకు పరిమితం చేశారని అన్నారు. రాష్ట్ర రాజధాని విభజనపై అవగాహన లేని వారు డొల్లతనంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. గత ప్రభుత్వంలో పరిశ్రమల శాఖ మంత్రి ఏ పరిశ్రమలు తీసుకువచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. జగన్ లాంటి పిచ్చోడి చేతిలో రాయి ఉండకూడదనే ఉద్దేశంతో అమరావతి రాజధాని బిల్లును అసెంబ్లీలో తీర్మానించి పార్లమెంట్‌కు పంపామని చెప్పారు. రాష్ట్రంలోని 5 కోట్ల మంది ప్రజల కల నేడు నెరవేరబోతోందన్నారు. గత ప్రభుత్వంలో కేవలం 20 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 22 నెలల్లోనే 75 శాతం పనులు పూర్తి చేసిందని తెలిపారు. వైసీపీ తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని, వైకాపా పార్టీ ఉందనే విషయాన్ని ప్రజలు మరిచిపోయారని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రం ఆర్థికంగా విచ్ఛిన్నమైందని, వ్యవస్థలన్నీ భ్రష్టుపట్టాయని, విపరీతమైన అప్పులతో రాష్ట్రం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పటికీ ఎన్డీయే ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. ఇచ్చిన హామీలను వంద శాతం అమలు చేశామని చెప్పారు. 50 ఏళ్ల రాజకీయ అనుభవం కలిగిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ మళ్లీ ప్రగతి పథంలో పయనిస్తుందని అచ్చెన్నాయుడు ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అవినీతి రహిత, పారదర్శక పాలన అందించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు.

## అమరావతిని ఏకైక రాజధానిగా కేంద్రం స్పష్టీకరణ... హర్షం వ్యక్తం చేసిన పల్లా

### మళ్లీ మావిగన్ అని మూడు రాజధానుల డ్రామా కి తెరలేపిన జగన్ రెడ్డి

### ప్రజలు తస్మాత్ జాగ్రత్త - ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు



**అమరావతి,సిటిజన్ టైమ్స్, ఏప్రిల్ 01:**

అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లుకు లోక్‌సభ ఆమోదం లభించడం ఐదుకోట్ల ఆంధ్రుల ఆకాంక్షలకు ప్రతిఫలంగా నిలిచిందని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఇది కేవలం ఒక చట్టపరమైన నిర్ణయం మాత్రమే కాకుండా, ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన చారిత్రాత్మక ఘట్టమని అభివర్ణించారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ.. "నా రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ -- నా రాజధాని అమరావతి" అనే భావనతో ప్రతి ఆంధ్రుడు గర్వంగా నిలిచే రోజు ఇదని తెలిపారు. అమరావతి నిర్మాణం రైతుల త్యాగాలు, మహిళల కన్నీళ్లు, ప్రజల కలల సమాహారమని పేర్కొంటూ, శాంతియుత పోరాటానికి దక్కిన విజయమిదని స్పష్టం చేశారు. రైతుల దీక్షలు, ఉద్యమాలు, ప్రజల అంకితభావానికి ఇది న్యాయం చేసిన నిర్ణయమన్నారు. ప్రజా రాజధాని అమరావతి ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిందని, ఈ బిల్లు ఆమోదం స్వర్ణాంధ్ర నిర్మాణంలో కీలక మైలురాయిగా నిలుస్తుందని తెలిపారు. గత పాలనలో నెలకొన్న అనిశ్చితి, సందిగ్ధతకు ఇది శాశ్వతంగా తెరదించిందన్నారు. ప్రపంచ స్థాయి రాజధానిగా అమరావతిని తీర్చిదిద్దే దిశగా కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. అమరావతిని ఏకైక రాజధానిగా కేంద్రం స్పష్టతనిచ్చిన నేపథ్యంలో రాష్ట్రానికి స్పష్టమైన దిశ లభించిందని పల్లా పేర్కొన్నారు. రాష్ట్రానికి ముఖచిత్రం, గౌరవప్రతీకగా అమరావతి నిలిచిందని, ఇకపై అభివృద్ధి దిశగా వేగంగా అడుగులు పడతాయని అన్నారు. గత గత ప్రభుత్వంలో మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని గందరగోళంలోకి నెట్టారని పల్లా ధ్వజమెత్తారు. ప్రపంచంలో దాదాపు ఎక్కడా అమలు కాని విధానాన్ని తీసుకువచ్చి అభివృద్ధిని అడ్డుకున్నారని విమర్శించారు. సచివాలయం ఒకచోట, అసెంబ్లీ మరోచోట ఉండే పరిస్థితులు పరిపాలనలో ఆలస్యం, ఖర్చుల పెరుగుదల, సమన్వయ లోపాలు తీసుకువస్తాయని పేర్కొన్నారు. అది అభివృద్ధి కాదు, అయోమయం సృష్టించే విధానమని స్పష్టం చేశారు. మళ్లీ మావిగన్ అని మూడు రాజధానుల పేరుతో ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేయడం జగన్ రాజకీయ స్వార్థానికి నిదర్శనమని పల్లా మండిపడ్డారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తస్మాత్ జాగ్రత్తగా వ్యవహరించాలని హెచ్చరించారు. అమరావతి బిల్లు ఆమోదానికి సహకరించిన ప్రధాని నరేంద్ర మోదీ గారికి, కేంద్ర హోంమంత్రి అమిత్ షా కి పల్లా కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మద్దతు, మంత్రి నారా లోకేష్ పాత్రతో ఈ విజయం సాధ్యమైందన్నారు. బలమైన రాజధాని నిర్మాణంతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని, అమరావతి భవిష్యత్తుపై ఉన్న అనుమానాలకు ఇక శాశ్వతంగా ముగింపు పలుకుదామని పల్లా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు.

## కూటమి ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమం రెండింటినీ సమానంగా ముందుకు తీసుకెళ్తోంది

### ఒకే రోజు పెన్షన్ల పెంపు చారిత్రాత్మక నిర్ణయం - మంత్రి కొలుసు పార్థసారథి



**ఆగిరిపల్లి:( సిటిజన్ టైమ్స్ ): ఏప్రియల్ :01:**

ఆగిరిపల్లి మండలంలో రూ.5.71 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం ఆగిరిపల్లి మండలం ఆగిరిపల్లి, తోటపల్లి గ్రామాల్లో బుధవారం రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాలు శాఖ మంత్రి కొలుసు పార్థసారథి "పేదల సేవలో" కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు. లబ్ధిదారుల కుటుంబ యోగక్షేమాలను అడిగి తెలుసుకుంటూ, గ్రామ సమస్యలను పరిశీలించారు. అనంతరం మండలంలో రూ.5.71 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీసుకున్న ఒకే రోజు పెన్షన్ల పెంపు నిర్ణయం చారిత్రాత్మకమని అన్నారు. దేశంలోనే అత్యధిక స్థాయిలో సామాజిక భద్రత కల్పిస్తున్న రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచిందని తెలిపారు. వృద్ధులు, వితంతువులకు రూ.4,000, దివ్యాంగులకు రూ.6,000, మంచానికే పరిమితమైన వారికి రూ.10,000 నుంచి రూ.15,000 వరకు పింఛన్లు అందించడం కూటమి ప్రభుత్వ పేదల పట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనమని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావిస్తూ కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని, గ్రామాల్లో ప్రజలంతా కలిసికట్టుగా ఉంటే ప్రభుత్వ పథకాలు మరింత విజయవంతం అవుతాయని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు సవాళ్లతో ఉన్నప్పటికీ, ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ మంచి పాలన అందిస్తున్నామని తెలిపారు. అలాగే, ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దు, అన్నా క్యాంటీన్ల పునరుద్ధరణ, రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ పెంపు, ఉపాధ్యాయ పోస్టుల భర్తీ వంటి పలు నిర్ణయాలు ప్రజల మేలు కోసమే తీసుకున్నామని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారంతో, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా వేగంగా పయనిస్తోందని తెలిపారు.

## స్టేషన్ బెయిల్ కోసం లంచం డిమాండ్

### ఏసీబీ కి చిక్కిన హెడ్ కానిస్టేబుల్



**సిటిజన్ టైమ్స్, ఆళ్లగడ్డ ఏప్రిల్ 01**

రక్షణ కల్పించాల్సిన పోలీసులే భక్షకులుగా మారి, బాధితుల నుంచి లంచాలు డిమాండ్ చేస్తున్న తీరు కలకలం రేపుతోంది. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ పట్టణ పోలీస్ స్టేషన్‌లో అవినీతి నిరోధక శాఖ అధికారులు నిర్వహించిన ఆకస్మిక దాడిలో హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వరరావు లంచం తీసుకుంటూ అడ్డంగా దొరికిపోయారు. అన్నదమ్ముల మధ్య తలెత్తిన ఒక ఘర్షణకు సంబంధించిన కేసులో, నిందితులకు స్టేషన్ బెయిల్ మంజూరు చేయాలని బాధితుడు రఘునాథ ఆచారి పోలీసులను ఆశ్రయించారు. అయితే, ఈ పని పూర్తి చేయడానికి హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వరరావు బాధితుడి నుంచి రూ. 35,000 లంచం డిమాండ్ చేశారు. బాధితుడు అప్పటికే రూ. 20,000 చెల్లించినప్పటికీ, మిగిలిన రూ. 15,000 ఇస్తేనే బెయిల్ ప్రక్రియ పూర్తి చేస్తానని కోటేశ్వరరావు ఒత్తిడి తెచ్చాడు. ఖాకీల వేధింపులు భరించలేకపోయిన రఘునాథ ఆచారి చివరకు ఏసీబీ అధికారులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన ఏసీబీ డీఎస్పీ సోమన్న నేతృత్వంలోని బృందం పక్కా వ్యూహంతో ఆళ్లగడ్డ పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద మాటు వేసింది. ముందస్తు పథకం ప్రకారం, బాధితుడు రఘునాథ ఆచారి నుంచి రూ. 15,000 నగదును హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వరరావు అందుకుంటుండగా, ఏసీబీ అధికారులు మెరుపు దాడి చేసి అతనిని పట్టుకున్నారు. నిందితుడి చేతులపై రసాయన పరీక్షలు నిర్వహించి లంచం తీసుకున్నట్లు నిర్ధారించారు. కేవలం ఒక హెడ్ కానిస్టేబుల్ స్థాయి అధికారి ఇంత భారీ మొత్తంలో లంచం డిమాండ్ చేయడం వెనుక స్టేషన్‌లోని ఇతర ఉన్నతాధికారుల హస్తం ఉందా? అనే కోణంలో ఏసీబీ అధికారులు లోతుగా ఆరా తీస్తున్నారు. ఈ లంచం సొమ్ములో ఎవరెవరికి వాటాలు ఉన్నాయనే విషయాన్ని తేల్చేందుకు కోటేశ్వరరావును విచారిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన ఏసీబీ అధికారులు, నిందితుడిని రిమాండ్ నిమిత్తం కర్నూలు ఏసీబీ కోర్టుకు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ సోమన్న మాట్లాడుతూ.. ప్రభుత్వ కార్యాలయాల్లో ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే భయపడకుండా ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 14400 కు సమాచారం ఇవ్వాలని కోరారు. అవినీతికి పాల్పడే వారు ఎంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ దాడి ఘటనతో ఒక్కసారిగా ఆళ్లగడ్డ పోలీస్ శాఖలో కలకలం రేగింది.

## గ్యాస్ లీకేజీ పట్ల భయాందోళన అవసరం లేదు -జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్



**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 1**

గ్యాస్ లీకేజీ పట్ల ప్రజలు భయాం దోళన చెందాల్సిన అవసరం లేదని అంతా నియంత్రణ లోనే ఉందని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అన్నారు.పి గన్న వరం మండలం బెల్లంపూడి గ్రామంలో మూసివేసిన ఓఎన్జిసి బోరు బావి ఎటువంటి పైప్ లైన్లు లేకుండా ఉన్నదని,దీనినీ నుండి చాలా నెమ్మదిగా గ్యాస్ స్వల్ప లీక్ అవ్వడం జరుగుతోందని గ్యాస్ లీకేజీని అరికట్టేందుకు అమలాపురం రాజోలు కు చెందిన రెండు అగ్నిమాపక వాహనాలు సంఘటనా స్థలానికి చేరుకున్నయన్నారు .రెస్క్యూ బృందం కూడా రానున్నదని ప్రజలు ఎటువంటి భయాందోళన లకు గురి కావాల్సిన అవసరం లేదని బోరుబావి నుండి లీకేజీ ను అరికెట్టేందుకు ముమ్మరంగా ప్రయత్నాలు కొనసాగుతున్నాయన్నారు.ఈ లీకేజీ ప్రధాన వాల్వుకు సంబంధించినది కాదని భయపడాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. కేవలం రిసిడ్యూవల్ లీకేజ్ మాత్రమే నన్నారు కొన్ని గంటలలో పూర్తిగా లీకేజ్ ఆగిపోతుందని ప్రజలు ఎటువంటి ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. నియంత్రణ చర్యల్లో భాగంగా ఓ ఎన్ జి సి బృందం అగ్నిమాపక యంత్రాలు లీకేజ్ను అరికట్టే ప్రయత్నంలో ఉన్నాయన్నారు. సాంకేతిక బృందం సూచనల ప్రకారం ఎవరిని తరలించాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు.

# మహిళ క్రికెట్‌లో సంచలనం.. టీమిండియా రికార్డు బ్రేక్ చేసిన కివీస్ కెప్టెన్



న్యూజిలాండ్ వర్సెస్ సౌతాఫ్రికా మహిళల రెండో వన్డే వెల్లింగ్టన్ వేదికగా జరిగింది. ఈ మ్యాచులో కివీస్ అమ్మాయిల జట్టు చారిత్రత్మక విజయాన్ని నమోదు చేసింది. సఫారీ జట్టు నిర్దేశించిన 347 పరుగుల టార్గెట్ న్ని చేధించి టీమిండియా పేరిట ఉన్న ప్రపంచ రికార్డును న్యూజిలాండ్ తిరగరాసింది. ఉమెన్స్ వన్డే క్రికెట్ చరిత్రలో అత్యధిక పరుగులు ఛేజ్ చేసిన జట్టుగా బ్లాక్ క్యాప్స్ రికార్డుల్లోకి ఎక్కింది. కాగా ఇంతకు ముందు ఈ హిస్టరీ భారత మహిళల జట్టు పేరుపై ఉండేది. వన్డే ప్రపంచకప్-2025లో ఆస్ట్రేలియాతో జరిగిన సెమీఫైనల్ లో ఉమెన్ ఇన్ బ్లూ.. 339 రన్స్ లక్ష్యాన్ని చేజ్ చేసింది. ఇప్పుడు ఈ రికార్డును న్యూజిలాండ్ బ్రేస్ చేసేసింది. ఈ మ్యాచ్ మొదట బ్యాటింగ్ చేసిన ప్రోటీస్ నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 346 రన్స్ చేయగా.. దక్షిణాఫ్రికా బ్యాటర్లలో అన్నేకే బోష్ (91), కెప్టెన్ లారా వోల్వార్డ్(69), ట్రయోన్(52), జాఫ్టా(37) అద్భుతంగా ఆడారు.

ఇక ఈ భారీ లక్ష్య చేధన కోసం బరిలోకి దిగిన న్యూజిలాండ్ బ్యాటర్లు సుజీ బేట్స్(8), ప్లిమ్మర్(23), మ్యాడీ గ్రీన్(13) ఘోరంగా విఫలం కావడంతో కెప్టెన్ అమెలియా కెర్ మాత్రం సంచలన ఇన్నింగ్స్ ఆడింది. ఓ వైపు క్రమంగా వికెట్లు పడుతున్నప్పటికి ఆమె మాత్రం తన విధ్వంసకర బ్యాటింగ్ ని కొనసాగించింది. చివరి ఓవర్లో 11 పరుగులు కావాల్సి ఉండగా.. కేర్ వరుసగా 3 బౌండరీలు బాది కివీస్ జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించింది. ఈ మ్యాచులో కెప్టెన్ అమేలియా కెర్ కేవలం 139 బంతుల్లో 23 ఫోర్లు, ఒక సిక్సుతో 179 పరుగులు చేసి అజేయంగా నిలిచింది.

మొత్తంగా మహిళల వన్డే క్రికెట్లో లక్ష్య చేధనలో అత్యధిక వ్యక్తిగత స్కోర్ సాధించిన రెండో ప్లేయర్ గా అమెలియా కేర్ నిలిచింది. అలాగే న్యూజిలాండ్ గడ్డపై వన్డేల్లో అత్యధిక వ్యక్తిగత పరుగులు సాధించిన మహిళ ప్లేయర్ గా కూడా కేర్ చరిత్ర నెలకొల్పింది. మ్యాచ్ అనంతరం జరిగిన మీడియా ప్రెజెంటేషన్‌లో కేర్ మాట్లాడుతూ.. ఈ ఇన్సింగ్స్ నాకు చాలా ప్రత్యేకమైనది. మేము డ్రెస్సింగ్ రూమ్‌లో ఉన్నప్పుడు కూడా గెలవగలమని నమ్మా, నేను మైదానంలోకి వెళ్లిన తర్వాత ముందుకు సాగాల్సిందేనని ఫిక్స్ అయినట్లు వెల్లడించింది.

# ఐపీఎల్‌లో డబ్బులు రావు.. అందుకే ఆడట్లేదు: ఆడమ్ జంపా



ప్రపంచంలోని అత్యుత్తమ వైట్ బాల్ స్పిన్నర్లలో ఒకడైన ఆస్ట్రేలియా లెగ్ స్పిన్నర్ ఆడమ్ జంపా, ఐపీఎల్ 2026 వేలానికి దూరంగా ఉండటంపై సంచలన వ్యాఖ్యలు చేశాడు. తన నైపుణ్యానికి ఐపీఎల్‌లో సరైన విలువ, డబ్బు లభించడం లేదని, అందుకే ఈ లీగ్‌లో ఆడటం లేదని స్పష్టం చేశాడు. ప్రస్తుతం జంపా పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్)లో కరాచీ కింగ్స్ తరఫున ఆడుతున్నాడు. ఇటీవల ఒక పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ జంపా తన అసంతృప్తిని బయటపెట్టాడు. "ఈ ఏడాది నేను ఐపీఎల్ నుంచి తప్పుకున్నాను. నిజం చెప్పాలంటే, నా లాంటి నైపుణ్యం ఉన్న ఆటగాడికి ఐపీఎల్‌లో ఇతర నైపుణ్యాలు ఉన్నవారికి లభించేంత డబ్బు రాదు. ఐపీఎల్ కోసం చాలా సమయం కేటాయించాల్సి ఉంటుంది. కానీ, అందుకు తగిన ప్రతిఫలం లేనప్పుడు అంత సమయం వెచ్చించడం సరైన నిర్ణయం అని నాకు అనిపించలేదు" అని జంపా వివరించాడు. గతంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) జంపాను విడుదల చేయగా, అతను ఈసారి వేలం కోసం తన పేరును నమోదు చేసుకోలేదు. 2016లో రైజింగ్ పుణె సూపర్ జెయింట్స్‌తో అరంగేట్రం చేసిన అతను, ఆ తర్వాత రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ), రాజస్థాన్ రాయల్స్ (ఆర్ఆర్) జట్లకు కూడా ప్రాతినిధ్యం వహించాడు. మొత్తం 22 ఐపీఎల్ మ్యాచ్‌లలో 8.37 ఎకానమీ రేటుతో 31 వికెట్లు పడగొట్టాడు. అయితే, ఏ సీజన్‌లోనూ ఆరు కంటే ఎక్కువ మ్యాచ్‌లు ఆడలేకపోయాడు.

పీఎస్ఎల్‌లో ఆడాలన్నది చివరి నిమిషంలో తీసుకున్న నిర్ణయమని జంపా తెలిపాడు. మొదట విశ్రాంతి తీసుకోవాలని భావించినా, నెల రోజుల క్రితం పీఎస్ఎల్ నుంచి అవకాశం రావడంతో వెంటనే అంగీకరించానని చెప్పాడు. ఐపీఎల్ నిబంధనల ప్రకారం తుది జట్టులో నలుగురు విదేశీ ఆటగాళ్లకే అవకాశం ఉంటుంది. దీంతో ఫ్రాంచైజీలు ఎక్కువగా పవర్ హిట్టర్లు, ఆల్-రౌండర్లు, ఫాస్ట్ బౌలర్ల కోసం భారీ మొత్తంలో ఖర్చు చేస్తాయి. స్పిన్నర్ల విషయంలో భారత్‌లో నాణ్యమైన స్థానిక ఆటగాళ్లు అందుబాటులో ఉండటంతో విదేశీ స్పిన్నర్లకు పెద్దగా డిమాండ్ ఉండటం లేదు. జంపా వ్యాఖ్యలు ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి.

# భారత్-జింబాబ్వే మధ్య రెండు సిరీస్‌లు.. షెడ్యూల్ విడుదల



టీ20 ప్రపంచకప్ ఛాంపియన్‌గా నిలిచిన టీమిండియా మరో అంతర్జాతీయ సిరీస్‌కు సిద్ధమైంది. ఈ ఏడాది జులైలో జింబాబ్వేలో పర్యటించి మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో పాల్గొననుంది. ఈ మేరకు జింబాబ్వే క్రికెట్ బోర్డు అధికారిక ప్రకటన విడుదల చేసింది. హరారే స్పోర్ట్స్ క్లబ్ వేదికగా జులై 23, 25, 26 తేదీల్లో ఈ మ్యాచ్‌లు జరగనున్నాయి. భారత కాలమానం ప్రకారం అన్ని మ్యాచ్‌లు సాయంత్రం 4:30 గంటలకు ప్రారంభమవుతాయి. ఇటీవల ముగిసిన 2026 టీ20 ప్రపంచకప్‌లోనూ ఇరు జట్లు తలపడ్డాయి. చెన్నైలో జరిగిన సూపర్-8 దశ మ్యాచ్‌లో భారత్ 72 పరుగుల తేడాతో జింబాబ్వేపై ఘన విజయం సాధించింది. అంతకుముందు 2024 టీ20 ప్రపంచకప్ గెలిచిన వెంటనే కూడా టీమిండియా జింబాబ్వేలో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడి 4-1 తేడాతో గెలుపొందింది. తాజా ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియా, శ్రీలంక వంటి బలమైన జట్లు ఉన్న గ్రూప్‌లో టాప్‌లో నిలిచి సూపర్-8కు చేరిన జింబాబ్వే, అదే జోరును సొంతగడ్డపై కొనసాగించాలని భావిస్తోంది.

ఈ సిరీస్‌పై జింబాబ్వే క్రికెట్ మేనేజింగ్ డైరెక్టర్ గివ్‌మోర్ మకోనీ మాట్లాడుతూ.. "భారత్‌తో మ్యాచ్‌లంటే ఎప్పుడూ భారీ ఆసక్తి ఉంటుంది. ప్రపంచ ఛాంపియన్లతో సొంతగడ్డపై తలపడటం మా ఆటగాళ్లకు ఒక గొప్ప అవకాశం. ప్రపంచకప్‌లో మా ప్రదర్శన ప్రోత్సాహకరంగా ఉంది. ఈ సిరీస్ ద్వారా ఆ జోరును కొనసాగించి, అంతర్జాతీయ క్రికెట్‌లో మరింత పోటీ శక్తిగా ఎదగడానికి ఇది బలమైన పునాది వేస్తుంది" అని వివరించారు. ఇక, వచ్చే ఏడాది ఆరంభంలో జింబాబ్వే జట్టు భారత్‌లో పర్యటించనున్నట్లు బీసీసీఐ ఇదివరకే ప్రకటించింది. 2027 జనవరిలో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ జరగనుంది. కోల్‌కతా (జనవరి 3), హైదరాబాద్ (జనవరి 6), ముంబై (జనవరి 9) ఈ మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. దాదాపు 25 ఏళ్ల తర్వాత జింబాబ్వే జట్టు భారత్‌లో ద్వైపాక్షిక సిరీస్ ఆడనుండటం విశేషం. చివరిసారిగా 2002 మార్చిలో జింబాబ్వే భారత్‌లో పర్యటించింది. ఈ సుదీర్ఘ విరామం తర్వాత భారత్‌లో పర్యటించడంపై మకోనీ సంతోషం వ్యక్తం చేశారు. "రెండు దశాబ్దాల తర్వాత మళ్లీ ద్వైపాక్షిక సిరీస్ కోసం భారత్‌లో పర్యటించడం ఒక చారిత్రాత్మక క్షణం. ఇది మా ఆటగాళ్లకు దక్కిన గౌరవం, విలువైన అవకాశం. ఈ పర్యటన ఇరు దేశాల మధ్య క్రికెట్ సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని, మా జట్టుకు ఎంతో అనుభవాన్ని ఇస్తుందని ఆశిస్తున్నాం" అని తెలిపారు.

# దిశా పటానీ అందాలకు సోషల్ మీడియాలో క్రేజ్.. ఫ్యాన్స్ ఫిదా

బాలీవుడ్ హాట్ బ్యూటీ దిశా పటానీ తన గ్లామరస్ లుక్స్‌తో ఇంటర్నెట్‌ను షేక్ చేస్తోంది. తెలుగులో 'లోఫర్' సినిమాతో ఎంట్రీ ఇచ్చి, రీసెంట్‌గా 'కల్కి 2898-ఏడీ'లో ప్రభాస్ సరసన మెరిసిన ఈ భామ, అటు సినిమాలతోనూ ఇటు హాట్ ఫోటోషూట్‌లతోనూ ఎప్పుడూ వార్తల్లో నిలుస్తోంది. తాజాగా దిశా పోస్ట్ చేసిన మైండ్ బ్లాక్ అయ్యే పిక్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తున్నాయి. ఆమె అందచందాలకు నెటిజన్లు ఫిదా అవుతూ లైకులు, కామెంట్లతో హోరెత్తిస్తున్నారు. ఆ విశేషాలు చూద్దాం ..

**టాలీవుడ్ ఎంట్రీ నుండి పాన్ ఇండియా స్టార్ వరకు :**




**వైష్ణవి చైతన్య టైమ్‌లెస్ ఎత్నిక్ లుక్‌లో గాంభీర్యాన్ని పునర్ని ర్వచించింది**

వరుణ్ తేజ్ నటించిన 'లోఫర్' సినిమాతో దిశా పటానీ తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది. మొదటి సినిమాతోనే తన క్యూట్ అండ్ హాట్ లుక్స్‌తో కుర్రాళ్ల మనసు దోచుకుంది. ఆ తర్వాత బాలీవుడ్‌లో వరుస అవకాశాలు అందుకుంటూ స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. ఇక పాన్ ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్ సరసన 'కల్కి 2898-ఏడీ'లో నటించి మరోసారి టాలీవుడ్ వెండితెరపై మెరిసింది. ఇక సూర్య కంగువ మూవీ లో నటించి మెప్పించింది. ఇక గ్లోబల్ లెవల్ ప్రాజెక్టుల్లో భాగమవుతూ తన క్రేజ్‌ను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్తోంది.

**సోషల్ మీడియాలో గ్లామర్ విందు:**

దిశా పటానీకి సోషల్ మీడియాలో ఉన్న ఫాలోయింగ్ అంతా ఇంతా కాదు. ఎప్పటికప్పుడు తన ఫిట్‌నెస్ వీడియోలను, గ్లామరస్ ఫోటోలను షేర్ చేస్తూ ఫ్యాన్స్‌ను ఖుషీ చేస్తూ ఉంటుంది. తాజాగా ఆమె షేర్ చేసిన ఫోటోల్లో మెరిసే డ్రెస్ వేసుకుని, తన ఎద అందాలతో కుర్రాళ్లకు మెంటలెక్కించేలా స్టిల్స్ ఇచ్చింది. ఈ ఫోటోలు చూసిన వారెవరైనా దిశా అందానికి దాసోహం అనాల్సిందే. నెట్టింట మంటలు పుట్టించడంలో ఈమె రూటే సెపరేట్ అని నెటిజన్లు



కామెంట్స్ చేస్తున్నారు.

**బ్రాండ్ ఎండార్స్‌మెంట్స్.. స్పెషల్ షోలతో బిజీ:**

కేవలం సినిమాలే కాకుండా, దిశా పటానీ టాప్ బ్రాండ్లకు అంబాసిడర్‌గా వ్యవహరిస్తూ కోట్లు గడిస్తోంది. ఫిట్‌నెస్ ఫ్రీక్ కావడంతో స్పోర్ట్స్ వేర్ మరియు ఫ్యాషన్ బ్రాండ్ల ప్రకటనల్లో ఈమెకు డిమాండ్ ఎక్కువగా ఉంది. అలాగే పలు స్పెషల్ షోలు, ఈవెంట్లలో తన డాన్స్ పర్ఫార్మెన్స్‌తో స్టేజ్‌పై నిప్పులు చెరుగుతుంది. ఇక బాలీవుడ్ టాప్ హీరోల సినిమాల్లో నటిస్తూనే, మరోవైపు గ్లామర్ షోతో తన పాపులారిటీ తగ్గకుండా జాగ్రత్త పడుతోంది. మొత్తానికి దిశా పటానీ అటు వెండితెరపై, ఇటు సోషల్ మీడియాలోనూ తన హవా కొనసాగిస్తోంది. నటనతో పాటు తన పర్ఫెక్ట్ ఫిజిక్‌తో యూత్ ఐకాన్‌గా మారింది. ప్రస్తుతం చేతిలో మరిన్ని క్రేజీ ప్రాజెక్టులు ఉన్న ఈ భామ, రాబోయే రోజుల్లో ఇంకెన్ని రికార్డులు సృష్టిస్తుందో చూడాలి. ఇక ఏదేమైనా దిశా పటానీ అప్‌డేట్ వచ్చిందంటే చాలు, నెటిజన్లు ఆ ఫోటోలపై ఒక లుక్కేయకుండా ఉండలేరు. ఈ బాలీవుడ్ భామ అందాలకు ఫిదా అవ్వని వారుండరంటే అతిశయోక్తి కాదు!



**త్రిధా చౌదరి నీలి రంగులో చక్కదనాన్ని పునర్నిర్వచించింది**

Printed, published,and owned by kancherla Sandeep kumar. Published at Door. No. 19-57, Deendayalpuram, mudasarlova, Visakhapatanam, Andrapradesh 530040.
Printed at Sri Sai Ganga printer's and publications flat no. 504,Bharat towers, 5th lane, Dwarakanagar, Visakhapatanam,Andrapradesh 530016.
Editor. Kancherla Sandeep Kumar. RNI No. APTEL /2009/28868.PHONE No. 9966447776